


కొనసాగిన ఏసీబీ సోదాలు

- జీవీఎంసీ జోన్-2 కమిషనర్ సింహాచలానికి సంబంధించిన మరికొన్ని ఆస్తులు గుర్తింపు
- ఎచ్చెర్లలో అర ఎకరా వ్యవసాయ భూమి, శ్రీకాకుళంలో మేనల్లుడి పేరుతో ఫ్లాట్
- నిందితుడికి పదో తేదీ వరకూ రిమాండ్

-8లో

రాగూర్ ఫార్మా కార్మికులకు చికిత్స

బాధితులకు కలెక్టర్, ఎస్పీ పరామర్శ




జి.శరత్‌కుమార్ | ఎ.అనీల్ | సీహెచ్.రాజారావు | ఎస్.భాస్కర్ | బి.వీరబాబు | డి.పాపారావు

గాజువాక, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పరవాడ మండలంలోని ఫార్మా సిటీలో వున్న రాగూర్ ఫార్మా కంపెనీలో విష వాయువు లీకైన సంఘటనలో అస్వస్థతకు గురైన కార్మికుల్లో ఆరుగురిని వడ్లపూడిలోని పవన్‌సాయి ఆస్పత్రికి తరలించారు. వీరిలో అగనంపూడికి చెందిన జి.శరత్‌కుమార్ (40), అనకాపల్లికి చెందిన ఎ.అనీల్ (24), అప్పికొండకు చెందిన సీహెచ్.రాజారావు (36), వడ్లపూడికి చెందిన ఎస్.భాస్కర్ (23), నాతయ్యపాలేనికి చెందిన బి.వీరబాబు (30), విజయనగరం జిల్లా గుర్లకి చెందిన డి.పాపారావు (33) వున్నారు. వీరిని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా, డీఎంహెచ్‌వో, ఇతర శాఖల ఉన్నతాధికారులు పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ఇద్దరు..

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాగూర్ లేబొరేటరీస్‌లో విషవాయువు లీక్ కావడంతో అస్వస్థతకు గురై షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ... మిగతా 8వ పేజీలో



అదే నిర్లక్ష్యం!

ఫార్మా కంపెనీల్లో ఆగని ప్రమాదాలు

- కార్మికుల ప్రాణాలతో చెలగాటం
- విచారణ కమిటీల నివేదికలు బుట్టదాఖలు
- తాజాగా 'పరవాడ'లోని రాగూర్ ఫార్మాలో విషవాయువు లీక్
- ఒకరి మృతి, తొమ్మిది మందికి అస్వస్థత



రాగూర్ ఫార్మాలో అస్వస్థతకు గురై కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ఫార్మా కంపెనీల్లో తరచూ సంభవిస్తున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. మానవ తప్పిదాలు, యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల వరుస ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటి నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరిగినప్పుడు సంబంధిత యాజమాన్యాలకు అధికారులు మొక్కుబడిగా నోటీసులు జారీ చేసి, తాత్కాలికంగా ఉత్పత్తులు నిలిపివేయిస్తున్నారు. కొద్దిరోజుల అనంతరం మళ్లీ అనుమతులు జారీ చేస్తున్నారు.

ఈ ఏడాది ఆగస్టు 21వ తేదీన అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 17 మంది మరణించారు. ఫార్మా రంగ చరిత్రలోనే ఇది అతి పెద్ద ప్రమాదం. ఈ సంఘటన మరువకముందే గత రెండు నెలల్లో పరవాడ ఫార్మాసిటీలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. గత నెలలో మెట్రో కంపెనీలో రియాక్టర్ పేలి పలువురు కార్మికులు గాయాలపాలయ్యారు. అదృష్టవశాత్తూ ప్రాణాలకు ముప్పు వాటిల్లలేదు. తరువాత సినర్జీస్ ఫార్మా కంపెనీలో చోటు చేసుకున్న ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. తాజాగా రాగూర్ లేబొరేటరీస్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. రియాక్టర్ కమ్ రిసీవర్ ట్యాంకు నుంచి 400 లీటర్ల ప్రమాదకర లిక్విడ్ లీకవడంతో కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటన బుధవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఈ ప్రమాదంలో ఒడిశాకు చెందిన అమిత్ భాగ్ (23) అనే కార్మికుడు మృతిచెందగా తొమ్మిది మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిని గాజువాకలో రెండు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఇద్దరు కార్మికుల పరిస్థితి విషమంగా ఉంది.

వరుస ప్రమాదాలతో కార్మికుల్లో ఆందోళన

అనకాపల్లి జిల్లాలో 118 ఫార్మా కంపెనీల్లో 20 వేల మందికి పైగా ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారు. గత ఆరేళ్ల కాలంలో ఫార్మా కంపెనీల్లో 54 ప్రమాదాలు జరిగాయి. ఈ సంఘటనల్లో 62 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. 92 మంది క్షతగాత్రులయ్యారు. అయితే వెలుగులోకి రాని ప్రమాదాలు అనేకం జరుగుతున్నాయి. ఇదిలావుండగా 2016 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ఆధ్వర్యంలో కంపెనీల్లో కంప్యూటర్ ఆధారిత తనిఖీలు అమలులోకి తేవడంతో స్థానిక అధికారుల భౌతిక తనిఖీలు నిలిచిపోయాయి. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ... మిగతా 8వ పేజీలో



విషవాయువు లీకైన రాగూర్ ఫార్మా కంపెనీ ఇదే

రాగూర్ ఫార్మాలో ప్రమాదం

ఒకరి మృతి, మరో పది మందికి అస్వస్థత

.... వివరాలు మెయిన్‌లో

తుఫాన్‌తో అప్రమత్తం

నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక

- ఆందోళన చెందుతున్న వరి రైతులు
- అధికారులకు జిల్లా కలెక్టర్ పలు ఆదేశాలు
- కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు



కోటవురట్ల మండలం పాతరోడ్డులో కోతకు వచ్చిన వరి పంట

అనకాపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో నెలకొన్న తీవ్ర వాయుగుండం బుధవారం రాత్రికి తుఫాన్‌గా బలపడినట్టు సమాచారం రావడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కాగా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో వరి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అయితే తీవ్రవాయుగుండం ప్రభావంతో బుధవారం జిల్లాలో ఎక్కడా వర్షం పడకపోయినప్పటికీ మసుగు వాతావరణం నెలకొని స్వల్పంగా గాలులు వీచాయి. అయితే గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ విజయకృష్ణన్ పలు శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. 30వ తేదీ వరకు కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌తోపాటు అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారులు తీరానికి చేరుకునేలా చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. రైతులు వరి కోతలను కొద్దిరోజులు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. ఇప్పటికే కోసిన వరి పైరును ఎత్తు ప్రదేశాల్లో కుప్పలుగా వేసి, తడవకుండా టార్పాలిన్లు కప్పుకోవాలని చెప్పారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సచివాలయాల సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండి అవసరం మేరకు ప్రజలకు సహాయం అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

కంట్రోల్ రూమ్	ఫోన్ నంబర్లు
కలెక్టరేట్	08924-226599
ఆర్డీఓ కార్యాలయం, అనకాపల్లి	9491998293
ఆర్డీఓ కార్యాలయం, నర్సీపట్నం	7075356563
	08934-245009
	8978542297

రైవాడకు మహర్దశ

జలాశయాన్ని సందర్శించిన సీడబ్ల్యూసీ నిపుణుల బృందం

- 'డ్రిప్' కింద అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
- రూ.336 కోట్లతో విస్తరణ, ఆధునికీకరణ
- ఎమ్మెల్యే బండారు కృషితో తొలి అడుగు



రైవాడ జలాశయాన్ని సందర్శిస్తున్న సీడబ్ల్యూసీ నిపుణుల బృందం

దేవరాపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైవాడ జలాశయం అభివృద్ధి గురించి శాసనసభ సమావేశాల్లో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం సత్వరమే స్పందించింది. కేంద్ర నీటి సంఘం (సెంట్రల్ వాటర్ కమిషన్.. సీడబ్ల్యూసీ) నిపుణుల బృందం బుధవారం రైవాడ రిజర్వాయర్‌ను పరిశీలించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు హరియాణాకు చెందిన సాంకేతిక నిపుణులు అఖిలేశ్, ఈజిప్టు దేశానికి చెందిన సివిల్ ఇంజనీరింగ్‌లో నిపుణుడు హనీతోపాటు రాష్ట్ర జల వనరుల శాఖ సీఈ ఎస్.సుగుణాకరరావు, ఎస్ఈ యాస్టికా, ఈఈలు విజయానంద్, త్రినాథం జలాశయాన్ని సందర్శించారు. స్పిల్‌వే, కుడి, ఎడమ కాలువలు, మదుములు, రెగ్యులేటింగ్ గేట్ల ఎగువ, దిగువ భాగాలను పరిశీలించారు. జలాశయం పరిస్థితుల గురించి డీఈఈ సత్యంనాయుడు, ఏఈఈలు నందకిశోర్, రవిప్రకాశ్, నాగేంద్ర, శాంతి వివరించారు. వీటిని నిపుణుల బృందం నమోదు చేసుకుంది. అంతకుముందు రైవాడ అతిథిగృహంలో జరిగిన భేటీలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, రైవాడ రిజర్వాయర్ విస్తరణ, అభివృద్ధికి సంబంధించి త్వరితగతిన నివేదికను రూపొందించి కేంద్రానికి పంపాలను నిపుణుల బృందాన్ని కోరారు. పనులకు అవసరమైన నిధులను సీఎం చంద్రబాబుతో పాటు రాష్ట్రానికి చెందిన కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మాట్లాడి మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ... మిగతా 8వ పేజీలో

సంక్షోభంలో ఎస్సీ హాస్టళ్లు

విద్యా సంవత్సరం ఆరంభం నుంచి విడుదల కాని డైట్ బిల్లులు

- అక్టోబరు చివరినాటికి జిల్లాలో రూ.1,57,40,394 బకాయిలు
- అప్పులు చేసి వసతి గృహాలను నిర్వహిస్తున్న వార్డెన్లు
- హాస్టల్ నిర్వహణ నిధులు సైతం పెండింగ్



నర్సీపట్నంలోని ఒక వసతిగృహంలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):

సాంఘిక సంక్షేమ (ఎస్సీ) శాఖ నిర్వహిస్తున్న విద్యార్థుల వసతి గృహాలు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. హాస్టళ్ల నిర్వహణ, విద్యార్థుల భోజనం బిల్లులు ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఒక్క నెల కూడా మంజూరు కాలేదు. వసతిగృహాల సంక్షేమాధికారులు చేతి డబ్బులు, లేదంటే అప్పులు చేసి హాస్టళ్లను నిర్వహించాల్సి వస్తున్నది. జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన అన్ని వసతిగృహాలకు మీద కోటిన్నర రూపాయలకు పైగా బిల్లులు పెండింగ్‌లో వున్నాయి.

సాంఘిక సంక్షేమ శాఖ అనకాపల్లి, పాయకరావుపేట, నర్సీపట్నం ఏఎస్‌డబ్ల్యూవోల పరిధిలో ప్రీమెట్రిక్ (3 నుంచి 10వ తరగతి వరకు) బాలురు వసతిగృహాలు 13, బాలికల వసతి గృహాలు 10, పోస్టుమెట్రిక్ (ఇంటర్ నుంచి పీజీ వరకు) బాలురు వసతి గృహాలు 4, బాలికల వసతిగృహాలు 4 ఉన్నాయి. ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో 2,506 మంది, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో 571 మంది.. మొత్తం 3,077 మంది వుంటున్నారు. విద్యార్థులు వసతిగృహాల్లో వుంటూ సమీపంలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యాభ్యాసం చేస్తుంటారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమల్లో వుండడంతో ఆయా విద్యార్థులకు వసతిగృహాల్లో ఉదయం అల్పాహారం, రాత్రికి భోజనం పెడతారు. పాఠశాలల సెలవు రోజుల్లో మధ్యాహ్నం కూడా హాస్టల్‌లోనే భోజనం చేస్తారు. కళాశాలల విద్యార్థులకు ఉదయం అల్పాహారంతోపాటు మధ్యాహ్నం, రాత్రికి వసతిగృహాల్లోనే భోజనం వడ్డిస్తారు. బియ్యం, వేరుశనగ చెక్కీలను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. వంట గ్యాస్‌తోసహా మిగిలిన అన్ని రకాల సరకులు, కూరగాయలను వార్డెన్లు స్థానికంగా కొనుగోలు చేసుకోవాలి. ప్రభుత్వం మూడు, నాలుగు తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.1,250, ఐదు నుంచి పదో తరగతి వరకు రూ.1,450, కళాశాలల విద్యార్థులకు రూ.1,600 చొప్పున చెల్లిస్తుంది. ప్రతి నెలా విద్యార్థుల హాజరునుబట్టి వార్డెన్లు బిల్లులు తయారు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. సాధారణంగా రెండు లేదా మూడు నెలలకు ఒకసారి బిల్లులు మంజూరు అవుతుంటాయి. అంతవరకు వార్డెన్లే సొంత సొమ్ముతో లేదా అప్పులు చేసి వసతిగృహాలను నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది జూన్ 12వ తేదీన విద్యా సంస్థలతోపాటు ఆయా వసతిగృహాలను కూడా తెరిచారు. అక్టోబరు వరకు దాదాపు నాలుగున్నర నెలల బిల్లులు అప్‌లోడ్ చేయగా, ఇంతవరకు ఒక్క నెల కూడా డైట్ బిల్లులు మంజూరు కాలేదు. వసతిగృహాల వార్డెన్లు (హెచ్‌డబ్ల్యూవోలు) కిరాణా దుకాణాల్లో సరకులు అరువులు తెచ్చి భోజనం వండి పెడుతున్నారు. జీతం డబ్బులతో కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. అక్టోబరు వరకు జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని అన్ని వసతిగృహాలకు రూ.1,57,40,394 బిల్లులు పెండింగ్‌లో వున్నాయి. అనకాపల్లి ఏఎస్‌డబ్ల్యూవో పరిధిలోని వసతి గృహాలకు రూ.77,76,675, నర్సీపట్నం పరిధిలో 58,14,665లు, పాయకరావుపేట పరిధిలో 21,49,054 బిల్లులు పేరుకు పోయాయి. మరో నాలుగు రోజుల్లో నవంబరు నెల కూడా ముగుస్తుంది. దీంతో కలిపితే పెండింగ్ బిల్లులు ఐదున్నర నెలలకు చేరుకుంటాయి.

ఇదిలావుండగా గతంలో ప్రీమెట్రిక్ వసతి గృహాలకు నిర్వహణ చార్జీలు కింద నెలకు రూ.1,000 చొప్పున ప్రభుత్వం మంజూరు చేసేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహణ నిధులు ఇవ్వడంలేదు.

ఒక రోజు ముందే పింఛన్ డబ్బులు

ఒకటో తేదీ ఆదివారం కావడంతో 30న పంపిణీ

అనకాపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ డబ్బులను ఈసారి ఒక రోజు ముందే పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డిసెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో నవంబరు 30వ తేదీన పెన్షదారులకు చెల్లింపులు జరపాలని నిర్ణయించింది. ఈ మేరకు డీఆర్‌డీఏ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాలో వివిధ రకాల పింఛన్‌దారులు 2,59,778 మంది వున్నారని, వీరికి చెల్లించడానికి ప్రభుత్వం రూ.107.29 కోట్లు మంజూరు చేసిందని డీఆర్‌డీఏ పీడీ శశీదేవి తెలిపారు. ఏదైనా కారణంతో పింఛన్ డబ్బులు తీసుకోలేకపోతే డిసెంబరు 2వ తేదీన తీసుకోవచ్చని, లేదంటే జనవరి ఒకటో తేదీన రెండు నెలల (డిసెంబరు, జనవరి) పింఛన్ డబ్బులు అందజేస్తామని చెప్పారు.

'పేట' మెయిన్ రోడ్డులో ఆక్రమణలు తొలగింపు

ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు

- ఇరువైపులా ఎనిమిది అడుగుల మేర మార్కింగ్



మెయిన్‌రోడ్డు ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

పాయకరావుపేట, నవంబరు 27:

స్థానిక మెయిన్‌రోడ్డు విస్తరణ జరిగే వరకు ట్రాఫిక్ సమస్యను నివారించడానికి పంచాయతీ అధికారులు రహదారికి ఇరువైపులా ఆక్రమణలను తొలగిస్తున్నారు. బుధవారం రోడ్డుకి ఒక్కోవైపు ఎనిమిది అడుగుల మేర మార్కింగ్ చేసే పనులు చేపట్టారు.

పాయకరావుపేటలో తాండవ వంతెన నుంచి వై జంక్షన్ వరకు సుమారు వంద అడుగుల వెడల్పుతో రహదారి వుంది. అయితే ఇరువైపులా పలుచోట్ల వ్యాపారులు ఆక్రమించుకోవడంతో రోడ్డు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది. ముఖ్యంగా గౌతమ్, చిత్రమందిర్ సెంటర్లు, మంగవరం రోడ్డు జంక్షన్ వంటిచోట్ల ఆక్రమణలు అధికంగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు అధిక రద్దీ కారణంగా వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించి డబుల్ రోడ్డుగా విస్తరణ చేయాలని ప్రభుత్వం గతంలో నిర్ణయించినప్పటికీ పలుకారణాలతో వాయిదా పడుతూ వస్తున్నది. అయితే మెయిన్ విస్తరణ జరిగేంత వరకైనా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తులు చేస్తుండడంతో పంచాయతీ అధికారులు స్పందించారు. మెయిన్‌రోడ్డుకి ఇరువైపులా ఎనిమిది అడుగుల మేర ఆక్రమణలు తొలగించాలని పంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. దీంతో పంచాయతీ అధికారులు మెయిన్‌రోడ్డుకి ఇరువైపులా బుధవారం మార్కింగ్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సీహెచ్‌ఆర్‌కే వర్మ మాట్లాడుతూ, రెండు రోజుల్లో ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని వ్యాపారులకు చెబుతున్నామని, లేనిపక్షంలో తామే తొలగింపు చర్యలు చేపడతామని తెలిపారు.

ఎస్టీబీని పరిశీలించిన చైర్‌పర్సన్



శ్రీరామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయం వద్ద ఎస్‌టీబీని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్

ఎలమంచిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మునిసిపాలిటీ పరిధి శ్రీరామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయం వద్ద ఎస్‌టీబీ (నీటి శుద్ధి విభాగం)ను బుధవారం టిడ్కో, మునిసిపల్ అధికారులతో కలిసి చైర్‌పర్సన్ రమాకుమారి పరిశీలించారు. గృహ సముదాయంలోని ఫ్లాట్‌లలో నివాసముం టున్న వారి వాడక నీరు ఈ ప్లాంట్‌లోకి వచ్చి శుద్ధి చేసే విభాగాన్ని పరిశీలించారు. ఈ ప్లాంట్ నుంచి వెళ్లే ఔట్‌లెట్‌లో డ్రైనేజీ సదుపాయం ఏర్పాటు కోసం ఈ పరిశీలన చేసినట్టు చైర్‌పర్సన్ తెలిపారు. నీటి శుద్ధి ప్లాంట్‌లో నీరు పూర్తిస్థాయిలో ఔట్‌లెట్ ద్వారా వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ స్థితిలో ప్రత్యేక డ్రైనేజీ నిర్మించాల్సిఉందని డిడ్కో డీఈ సంధ్య చైర్‌పర్సన్‌కు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, టిడ్కో సిబ్బంది మూర్తి, పాల్గొన్నారు.

అలరించిన పేటతుళ్లి వేడుక



ఊరేగింపు చేస్తున్న అయ్యప్ప భక్తులు

మునగపాక, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడ్రాపల్లిలో బుధవారం నిర్వహించిన అయ్యప్ప స్వామి పేటతుళ్లి వేడుక అలరించింది. గ్రామంలో చినరామ స్వామి కోవెల పీఠంలో పలువురు భక్తులు అయ్యప్ప దీక్ష చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం పీఠం నుంచి పేట తుళ్లి ఉత్సవంలో భాగంగా గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారులు ప్రత్యేక వేషధారణలు, గదలు, బాణాలు చేత పట్టుకుని నృత్యాలు చేశారు. అనంతరం మళ్ల వరహా నర్సింగరావు స్వామి స్వామిలకు భిక్ష ఏర్పాటు చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



షూటింగ్ బాల్ పోటీలో విజేతలను అభినందిస్తున్న కైట్స్ పాఠశాల కరస్పాండెంట్ గణేష్

అచ్యుతాపురం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కైట్స్ విద్యావిహార్ పాఠశాలకు చెందిన విద్యార్థులు షూటింగ్ బాల్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల విభాగంలో ప్రథమస్థానం, బాలుర విభాగంలో తృతీయ స్థానం నిలిచారు. వీరిలో కె ఉత్తమ ప్రతిభ కనబరచిన జి.తేజ, వై.సందీప్, డి.మోహన్ ప్రదీప్‌లను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వచ్చే నెల 7,8,9 తేదీలలో జరిగే అనంతపురంలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో వీరు పాల్గొంటారు. ఎంపికైన ఈ విద్యార్థులను బుధవారం కరస్పాండెంట్ రెడ్డి గణేష్, ప్రిన్సిపాల్ ప్రసన్న అభినందించారు.

లక్ష్యానికి మించి టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ



వెలమకాలనీలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న వరహాలబాబు

పాయకరావుపేట, నవంబరు 27: పాయకరావుపేటలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియను లక్ష్యానికి మించి చేస్తామని పాండురంగస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ యాళ్ల వరహాలబాబు తెలిపారు. పట్టణంలోని వెలమ కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అలాగే రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజాన ఆది, పి.సూరిబాబు, చిరుకూరి పేర్రాజు, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన



బాల్య వివాహాల నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

పాయకకరావుపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం, వెంకటనగరం గ్రామాలలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ బాల్య వివాహాలు సాంఘీక దురాచారమే కాకుండా నేరమన్నారు. అలాగే బాలికల విద్య, రక్షణ, ఆరోగ్య అభివృద్ధికి ఆటంకమన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌ను సాధిస్తామని బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఆవు పాల ధర తగ్గింపుపై పాడి రైతుల ఆందోళన

అచ్యుతాపురం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ అర్ధాంతరంగా ఆవుపాలు లీటరుపై రూ. 3 తగ్గించడంపై బుధవారం మండలంలోని మడుతూరు, చీమలాపల్లి గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాల వద్ద పాడి రైతులు ఆందోళన నిర్వహించారు. పాల రైతుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కర్రి అప్పారావు, రైతు సంఘం జిల్లా నాయకులు బుద్ధ రంగారావు ఆధ్వర్యంలో ఈ నిరసనలు కొనసాగాయి. పాలధర తగ్గింపుపై గత నెల 29న డెయిరీ ప్రధాన ద్వారం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశామన్నారు. అనంతరం నాలుగు జిల్లాల్లోని ఎమ్మెల్యేలకు, మంత్రులకు, జిల్లా కలెక్టర్‌లకు ఫిర్యాదులు కూడా చేశామన్నారు. ఇదే విషయంపై అసెంబ్లీలో చర్చ కూడా జరిగిందన్నారు. ఈ సందర్భంగా తగ్గించిన పాల ధరను పెంచాలని డిమాండ్ చేస్తూ డిసెంబరు 2న గాజువాకలో విశాఖ డెయిరీని ముట్టడించనున్నట్టు చెప్పారు.



మడుతూరు పాలసేకరణ భవనం వద్ద ఆందోళన చేస్తున్న పాడి రైతులు

'ట్రాక్టర్ నిర్వాహకులపై కేసులు అన్యాయం'



డీటీకి వినతి పత్రమిస్తున్న కౌన్సిలర్లు, నేతలు, ట్రాక్టర్ యజమానులు

ఎలమంచిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ నిర్వాహకులు ఏడుగురుపై పోలీసులు బైండోవర్ చేయడంపై పునఃపరిశీలన చేయాలని కోరుతూ బుధవారం ఎంపీపీ బోదెపు గోవింద్‌తో పాటు కౌన్సిలర్లు పిట్టా సత్తిబాబు, మరిణేశ్వరావు కోరారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ నిర్వాహకులు త్రినాధ్ మరికొంత మందితో కలిసి బుధవారం రెవెన్యూ కార్యాలయంలో డీటీ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ట్రాక్టర్ల నిర్వాహకులు నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక, మట్టి తరలించలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని రీతిలో ఎలమంచిలిలో ఉండడం పరిశీలించాలని వినతిలో పేర్కొన్నట్టు ఎంపీపీ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల ఆటో బోల్తా

▸▸ సచివాలయ మహిళా ఉద్యోగికి స్వల్ప అస్వస్థత

మునగపాక, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్ రోడ్డులో గ్యాస్ సిలిండర్లతో వస్తున్న ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఒకరు స్వల్ప అస్వస్థతకు లోనయ్యారు. వివరాలివి..గృహ వినియోగదారులకు పంపిణీకి బుధవారం గ్యాస్ సిలిండర్లతో పరవాడ నుంచి ఆటో బయలుదేరింది. మునగపాక బైపాస్‌మార్గంలో ఎ దురుగా వస్తున్న వాహనాన్ని గుర్తించి డ్రైవర్ సడన్ బ్రేక్ వేశారు. అదే సమయంలో సమీపంలో ఉన్న ఇళ్ల నుంచి వివరాలు సేకరిస్తున్న సచివాలయ మహిళా ఉద్యోగి ఈహఠాత్ పరిణామానికి భయంతో కింద పడింది. ఆమెను వెంటనే సచివాలయ ఉద్యోగులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. స్వల్ప అస్వస్థతకు గురైన ఆమెను అనకాపల్లి వంద పడకల ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్స పొందుతున్నారు. ఆటో డ్రైవర్‌కు ఏమీకాలేదు. ఆటోలో ఉన్న గ్యాస్ సిలిండర్లు రోడ్డుపై దొర్లడంతో స్థానికులు ఆందోళనకు లోనయ్యారు.ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

అచ్యుతాపురం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకర్లలో గల ఇచ్ఛా ఫౌండేషన్ అనాథ పిల్లల ఆశ్రమంలో బుధవారం స్థానిక టీడీపీ నాయకులు కర్రి రమణ నిత్యావసర సరకులను అందజేశారు. తన మనుమరాలు చిట్టిబోయిన ఇలియానా పుట్టినరోజు పురస్కరించుకుని ఒక్కరోజు భోజన సదుపాయంతోపాటుగా, సరకులను పంపణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకు లు గెంజి రాజు, పట్నాల భానుప్రసాద్, కర్రి కృష్ణ, పితాన రాంబాబు, గెద్దాడ శంకర్, దుర్గా ప్రసాద్, తల్లితండ్రులు వెంకట రమణ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల భద్రత బాధ్యత డ్రైవర్లదే: డీఎస్పీ

అచ్యుతాపురం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కంపెనీల నుంచి ఉద్యోగులను సురక్షితంగా ఇళ్లకు చేర్చే బాధ్యత ప్రతీ బస్సు డ్రైవర్‌పై ఉందని పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ అన్నారు. బ్రాండిక్స్ కంపెనీలో పనిచేస్తున్న బస్సు డ్రైవర్లతో ఆయన మంగళవారం రాత్రి భద్రత, ట్రాఫిక్ సమస్యలు, అతివేగం తదితర వాటిపై అవగాహన కల్పించారు. వేలాది మంది ఉద్యోగులను తీసుకుని వెళ్లే క్రమంలో మత్తు పదార్థాలను సేవించి వాహనం నడపడం వల్ల డ్రైవర్ల ప్రా ణాలతో పాటు బస్సులోని ప్రయాణించే వారికి ముప్పులో పడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ నమ్మి గణేష్, బ్రాండిక్స్ కంపెనీ ప్రతినిధులు, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ సత్యనారాయణ

ఘనంగా బాల గౌరమ్మ నిమజ్జనం

మునగపాక, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేపచెట్టు వద్ద గైరమ్మ మందిరంలో కొలువై ఉన్న ఉత్సవ బాల గౌరమ్మ నిమజ్జనం బుధవారం జరిగింది. ఈ నెల 4వ తేదీన ఆలయంలో బాల గౌరమ్మను నిలుపు చేశారు. సుమారు నాలుగు వారాలు సాంప్రదాయ పూజలను నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో మహిళలు ప్రదర్శించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం అయ్యప్పస్వామి మందిరం వద్ద ఉన్న స్నానఘట్టం వద్ద నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఈ వేడుకలో పాల్గొన్నారు. కాగా గౌరీ పరమేశ్వరులు ఉత్సవం మాత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి మొదటి శనివారం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెంటకోట ఆదినారాయణ, ఆడారి అప్పలనాయుడు, పొలిమేర కృష్ణ, పెంటకోట ఆదినారాయణనాయుడు, పెంటకోట అజయి, ఆడారి సూర్య చంద్రరామారావు, టెక్కలి వీరకొండలరావు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న ప్రతినిధులు

ఏడుగురిపై బైండోవర్ కేసులు

ఎలమంచిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లపై మట్టి, గ్రావెల్ తరలించకుండా ఉండేలా ఏడుగురు వ్యక్తులపై బైండోవర్ చేసినట్టు రూరల్ ఎస్ఐ ఉపేంద్ర బుధవారం తెలిపారు. ఇసుక, మట్టి అ క్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు స్పందన

తెలుగు యువత జిల్లా నేత నాగేశ్వరావు

ఎలమంచిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషమైన స్పందన లభిస్తోందని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు గొన్నాబత్తుల నాగేశ్వరావు (శేషు) అన్నారు. బుధవారం మండలంలోని బయ్యవరంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ద్వారా బీమా సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు.బయ్యవరంలో ఇప్పటికే 330 సభ్యత్వాలతో మండలంలో ఈ గ్రామం అగ్రస్థానంలో ఉందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావుల పర్యవేక్షణలో ఈ సభ్యత్వ నమోదు కొనసాగుతుందన్నారు. లక్ష్యాలను అధిగమించేందుకు టీడీపీ కుటుంబ సభ్యులంతాకృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాంబిల్లి మండలంలో..

రాంబిల్లి: మండలంలోని జడ్ చింతువా పంచాయతీలోని లోవపాలెం, తోటవీధి గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ యూనిట్ ఇన్‌చార్జి ఎరిపిల్లి చిట్టిబాబు, గ్రామ అధ్యక్షులు చెల్లూరి ఆనంద్ తెలిపారు. బుధవారం వారు గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే తమ పంచాయతీలో 300లకు పైగా సభ్యత్వ నమోదయ్యారన్నారు. పార్టీని గ్రామాల్లో మరింతగా పటిష్ఠపరిచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సీహెచ్ రాము, వై.రాజునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



బయ్యవరంలో సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

ఈ భవనాలు ఎప్పటికి పూర్తయ్యేనో..?

అసంపూర్తిగా ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాలు

కోటవురట్ల, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): మండలం రాజుపేట గ్రామ సచివాలయం పరిధిలో ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రైతు సేవా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండో విడతగా 2021-22 సంవత్సరానికిగాను రాజుపేట గ్రామంలో రైతు సేవా కేంద్రానికి రూ.21.8 లక్షలు, ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి రూ.20.8 లక్షలు చొప్పన నిధులు కేటాయించింది. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్న తరుణంలో ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరులో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ మధ్యలోనే నిర్మాణాలను నిలిపివేశారు. ఎన్నికల మూడు నెలలు ముందు చేసిన పనులు బిల్లులు మంజూరు చేయడంతో, మరలా పనులు తిరిగి ప్రారంభించారు. చివరికి నిర్మాణ పనులు శ్లాబ్ వరకు దాదాపు 80 శాతం పూర్తిచేశారు. ఇంతలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎక్కడ పనులు అక్కడే ఆపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిర్మాణ పనులకు నిధులు మంజూరుకాక, పనులు ముందుకు కదలలేదు. ఈ భనాల నిర్మాణ పనులు జాబితాను ప్రభుత్వం కోరింది. అయితే 80 శాతం పనులు పూర్తయిన వాటిని పట్టించుకోకుండా, 60 శాతం వరకు పనులు జరిగిన భవనాలకు నిధులు మంజూరు చేస్తుండడం విశేషం. రైతు సేవా కేంద్ర భవనానికి రూ.11 లక్షలు, ఆరోగ్య ఉప కేంద్ర భవనానికి రూ.12 లక్షల చొప్పన బిల్లులు అయ్యాయి. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ భవనాలను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.





రాజుపేటలో మధ్యలో నిలిచిపోయిన రైతు సేవా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రాల భవనాలు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పాయకరావుపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ సూచించారు. మండలంలోని శ్రీరాంపురం, అరట్లకోట గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. కోత కోసిన పనలను కుప్పలు పెట్టుకోవాలని చెప్పారు. వర్షాలు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శ్రీహరిరావు, వ్యవసాయ సిబ్బంది వీరబాబు, రమ్య, శృతి పాల్గొన్నారు.



అరట్లకోటలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో

నిబంధనలు బేఖాతారు



ఎలమంచిలిలో ప్రధాన రహదారిలో పరిమితికి మించి ప్రయాణికులతో ఆటోల్లో రాకపోకలు సాగిస్తున్న డ్రైవర్లు

ఎలమంచిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆటోల డ్రైవర్ల అతి వేగం..పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణించడం.. తదితర వాటితో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న అవగాహన కల్పిస్తున్నా డ్రైవర్లు పట్టించుకోవడంలేదు. ఎలమంచిలి పట్టణ రోడ్లపై నిబంధనలు అతిక్రమిస్తూ యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తుండం తో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడపడితే వాహనాలు నిలిపివేయడం, బస్టాండ్ జంక్షన్ ఇన్‌గేటు, అవుట్ గేట్ ఎదురుగా అనధికారికంగా పార్కింగ్‌తో ప్రమాదాలకు ఆస్కారం కలుగుతోంది. జంక్షన్ రోడ్డు మధ్యలో యూటర్న్ చేయడం, దిమిలి రోడ్డు, సైతారుపేట రోడ్డు మీద ప్రయాణీకుల కోసం ఆటోలను నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. కొందరు ఆటో డ్రైవర్లు ఆటోల్లో పరిమతికి మించి ప్రయాణీకులను తరలిస్తున్నారు. వేలాడుతూ వెళ్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎదుట వాహనాలను ఓవర్‌టేక్ చేస్తూ అమితవేగంగా నడుపుతున్నారు. పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ జరిమానాలు విధిస్తున్నా ఆటో డ్రైవర్లలో మాత్రం మార్పుకానరావడం లేదు. ఈ నేపథ్యంలో పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌ను కలిసిన నాయకులు



రంగనాయకులను సన్మానిస్తు యాదవ సంఘాల నేతలు

రాంబిల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులను బుధవారం హరిపురంలోని ఆయన నివాసంలో మూలజంజ, మూలకొత్తూరుకు చెందిన యాదవ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తనకు ఇచ్చిన ఈ పదవికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తానన్నారు. యాదవుల సంక్షేమమే ధ్యేయంగా పాటుపడతానన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం: సీఐ

అచ్యుతాపురం రూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్థానిక సీఐ నమ్మి గణేష్ అన్నారు. కైట్స్ కళాశాల ఆవరణలో బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలపై జ రుగుతున్న నేరాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మైనర్ విద్యార్థులు కొత్త వ్యక్తుల పరిచయాల పేరుతో కలవడం వల్ల జీవితాలు నాశనమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మొబైల్స్ అతిగా వినియోగించడంతో భవిష్యత్తు దెబ్బతింటోందన్నారు. ఏదైనా ఛానల్ సబ్‌స్క్రైబ్ చేసుకునే ముందుగా ఆలోచించాలని సూచించారు. ఎవరి భద్రత, భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, విల్లూరి ప్రశాద్, అడిగర్ల శంకరరావు, కానిస్టేబుల్ బంగారాజు తదితరులు పాల్గొన్నారు.

ఠాగూర్ లేబొరేటరీస్ ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి: సీఐటీయూ

అచ్యుతాపురం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఠాగూర్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ. కోటి పరిహారం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఫార్మా కంపెనీలలో కార్మికుల ప్రాణాలను పట్టించుకోవడం లేదన్నారు. ఠాగూర్ ఫార్మా కంపెనీలో విష రసాయన వాయువులు లీకవడంతో తొమ్మిది మంది అస్వస్థతకు గురై, ఒక కార్మికుడు మృతి చెందారని తెలిపారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ప్రమాదాలను నియంత్రణకు గట్టి భద్రతా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. ఫార్మా కంపెనీలపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలు. భ ద్రతాపరమైన లోపాలుంటే సరిచేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

కార్తీక అన్నసమారాధన



అన్న సమారాధనలో భక్తులు

ఎలమంచిలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని త్రిమూర్తులు స్వామి ఆలయం వద్ద బుధవారం కార్తీక మాసం అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

కోలుకున్న కలుషిత ఆహారం తిన్న బాధితులు

ఎస్. రాయవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వవరం అగ్రహారంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన ఐదుగురు కోలుకున్నారు. సోమవారం రాత్రి ఉప్మా తినడంతో అడపా లోవ, సేనాపతి చిరంజీవి, అతడి భార్య లక్ష్మి, కుమార్తెలు లిఖిత, పల్లవి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. బుధవారం సాయంత్రం అనకాపల్లిలో చికిత్స పొందుతున్న చిరంజీవి, అతని కుమార్తెలు లిఖిత, పల్లవిలను ఆస్పత్రి నుంచి డిచార్జి చేయగా, కేజీహెచ్‌లో ఉన్న లోవ, లక్ష్మి ఇంకా చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్యం కూడా బాగానే ఉందని, ఇద్దరినీ గురువారం డిచార్జి చేయడం జరుగుతుందని వైద్యులు తెలిపారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్టు

రావికమతం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు కొత్తకోట సీఐ కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. గత నెల 29న గంజాయి తరలిస్తున్న కేరళకు చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వీరికి సరకు అందించిన పెదబయలు మండలానికి చెందిన వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. అతనిపై ప్రత్యేక నిఘా పెట్టామని, గ్రామంలో తిరుగుతున్నట్టు సమాచారం రావడంతో బుధవారం వెళ్లి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అతన్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని సీఐ తెలిపారు.

ధనిశెట్టి బాబూరావుకు మాజీ ఎమ్మెల్యే జోగులు పరామర్శ



వైసీపీ నాయకుడు ధనిశెట్టి బాబూరావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

పాయకరావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న వైసీపీ సీనియర్ నాయకుడు ధనిశెట్టి బాబూరావును మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు బుధవారం పరామర్శించారు. పాయకరావుపేటలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బాబూరావును జోగులుతో పాటు జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహా మండలి మాజీ చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, వైసీపీ జిల్లా ప్రచార పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా తదితరులు పరామర్శించి ఆతని ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. వీరి వెంట వైసీపీ నాయకులు గెడ్డమూరి శ్రీనివాసరావు, చేపల తాతాజీ, పోసిన వీరబాబు తదితరులు ఉన్నారు.

వైద్య సేవలపై దృష్టిసారించండి

- బీఎన్ రోడ్డు త్వరితగతిన పూర్తిచేయాలి
- డొక్కు బస్సులతో ప్రయాణికుల ఇక్కట్లు
- సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలి
- మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు
- ప్రతీ మండలానికి కోల్డ్ స్టోరేజీ: ఎమ్మెల్యే రాజు



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

రావికమతం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైద్య సేవలపై ప్రత్యేక దృష్టిసారించాలని ప్రజాప్రతినిధులు తెలిపారు. అలాగే బీఎన్ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని, ఆర్టీసీలో డొక్కు బస్సులు నడపడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ రైతులు పండించిన ఉత్పత్తులు నష్టపోకుండా ప్రతీ మండలంలోనూ కోల్డ్ స్టోరేజీ నిర్మిస్తామన్నారు. మండలంలోని పి.పొన్నవోలు, టి.అర్జాపురం మధ్యలో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. వ్యవసాయ రంగాన్ని రైతులకు లాభసాటిగా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్టీల ప్రమేయం లేకుండా సమస్య తెలిపిన మరుక్షణమే పరిష్కరించడానికి కృషి చేస్తామని చెప్పారు. బీఎన్ రోడ్డు అభివృద్ధి పనులను త్వరగతిన జరిగేలా సదరు కాంట్రాక్టరుతో మాట్లాడాలని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఎమ్మెల్యే రాజును కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ ఇప్పటికే కాంట్రాక్టర్‌తో మాట్లాడం జరిగిందని, మేడివాడ నుంచి రోలుగుంట వరకూ ఒక కాంట్రాక్టర్, మేడివాడ నుంచి వడ్డాది వరకు మరొకరు, అక్కడి నుంచి వెంకన్న పాలెం వరకు ఇంకో కాంట్రాక్టర్‌తో ఈ పనులను త్వరగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేట్టామన్నారు. కొత్తకోటలో లక్షల విలువైన ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతానికి గురవుతున్నదని, అక్రమణలపై అధికారులు చర్యలు చేపట్టేలా ఆదేశించాలని కొత్తకోట ఎంపీటీసీ సభ్యుడు పూడి దేవా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గ్రామంలో ఉన్న మూడు గ్రామ సచివాలయాలకు డిజిటల్ అసిస్టెంట్‌లు లేక ఏ పనులు జరగడం లేదని, దీంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొమిరలో కూడా డిజిటిల్ అసిస్టెంట్ లేరని కవ్వగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి ఎమ్మెల్యేకు తెలిపారు. త్వరలోనే సిబ్బంది రప్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నర్సీపట్నం డిపో నుంచి చోడవరం రూట్‌లో డొక్కు బస్సులను నడుపుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఎంపిటీసీ సభ్యులు, సర్పంచులు తెలిపారు.

రావికమతం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో పాముకాటుకు గురైన బాధితులను నర్సీపట్నం కాకుండా 108లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించేందుకు 108 సిబ్బంది నిరాకరిస్తున్నారని పలువురు సభ్యులు తెలిపారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పాముకాటు బాధితులను అనకాపల్లి తరలించే విధంగా చర్యలు చేపట్టాలని సభలో తీర్మానించారు. నర్సీపట్నం ఆస్పత్రికి రోగిని తరలిస్తే, అక్కడ రోగి పరిస్థితి విషమంగా ఉందని తెలిపి విశాఖకు తరలించాలంటే సుమారు ఐదు నుంచి ఆరుగంటల సమయం పడుతున్నదని, ఈ మధ్యలో రోగి మృత్యువాత పడుతున్నారని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అదే అనకాపల్లి ఆసుపత్రి నుంచైతే గంటన్నర వ్యవధిలో విశాఖకు తరలించే అవకాశం ఉంటుందని, దీనివల్ల వేగంగా వైద్య సేవలు అందించి రోగి ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. ఈ సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు దంట్ల వెంకటరమణ, భవానీప్రసాద్, ఎంపీడీవో భానోజీరావు, తహసీల్దార్ బి.వెంకటరమణ, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రతీ రైతు విత్తనోత్పత్తి కేంద్రం కావాలి

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) ప్రతీ రైతు విత్తనోత్పత్తి కేంద్రంగా తయారు కావాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద బుధవారం రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం విత్తనాలను రైతులే తయారు చేసుకునేవారని, దీంతో ఆర్థిక భారం తగ్గేదని చెప్పారు. లాభసాటి పంటలు, కూరగాయలు ఎక్కువగా సాగు చేసుకోవాలని సూచించారు. అలాగే కూరగాయల కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేస్తామన్నారు. మినుము, రాగులు, పెసర విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎల్.వై.కాంతమ్మ, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, దేవరాపల్లి, కాశీపురం సర్పంచులు ఆదిరెడ్డి వరలక్ష్మి, సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మొల్లి కృష్ణమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేడివాడలో బీఎన్ రోడ్డు పనులు ప్రారంభం

రావికమతం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడ వద్ద బీఎన్ రోడ్డు పనులను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు బుధవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ చేసిన పనులకు వైసీపీ ప్రభుత్వం పైసా కూడా విడుదల చేయకపోవడంతో రోడ్డు పనులను మధ్యలోనే నిలిపివేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు, ఆర్అండ్‌బీ శాఖా మంత్రి జనార్ధన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లడంతో సమస్య కొలిక్కి వచ్చిందన్నారు. దీంతో బుధవారం నుంచి ఈ రోడ్డు నిర్మాణ పనులు పునఃప్రారంభమయ్యాయని ఆయన చెప్పారు. ఇకపై రోడ్డు నిర్మాణ పనులు ఆగవని, త్వరగతిన పూర్తిచేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, మేడివాడ సర్పంచ్ వజ్రపు లీలా నరసింహశివ, రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, ఆర్అండ్‌బీ మాడుగుల సెక్షన్ జేఈ సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'దళిత సమస్యలపై పోరాడిన మరిడియ్యకు టీడీపీలో మంచి గుర్తింపు'


మరిడియ్యను సన్మానిస్తున్న దళిత ప్రగతి సంఘం నాయకులు

నాతవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దళిత, ఆదివాసీ సమస్యలపై అనేక పోరాటాలు చేసిన కొంగ్రు మరిడియ్యకు రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇచ్చి టీడీపీ మంచి గుర్తింపునిచ్చిందని దళిత ప్రగతి ఐక్య సంఘం మండల అధ్యక్షుడు సామర్ల రామారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం మరిడియ్యను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరుగుడు పంచాయతీలో లేటరైట్ తవ్వకాల వల్ల పర్యావరణం దెబ్బతింటుందని గిరిజనుల తరపున మరిడయ్య పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బంగారు సూరిబాబు, నాయకులు అంకంరెడ్డి యర్రాపాత్రుడు, ఈరూడి గంగరాజు, నాసా సంస్థ సోషల్ వర్కర్ తాటిపాక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలు అందించాలి

మాకవరపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పేదలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఎంపీపీ రుత్తల లక్ష్మి సూచించారు. బుధవారం బూరుగుపాలెం పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలో అన్ని మందులు ఉండాలన్నారు కుక్క, పాముకాటులకు వ్యాక్సిన్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం ఆస్పత్రిలో చేపట్టాల్సిన పనులపై తీర్మానం చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ వెంకటరమణ, వైద్యులు చర్మిషా, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు

చోడవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉషోదయ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అందరినీ అలరించాయి. ఈ వేడుకలు సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు కళాశాల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ, కరస్పాండెంట్ కృష్ణకుమారి, డీన్ వాసు, ప్రిన్సిపాల్ నాయుడు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీజీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



నర్సీపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమెస్ట్రీ) జనరల్ కేటగిరీలో 13 సీట్లు, ఈడబ్ల్యూఎస్ కోటా కింద నాలుగు మొత్తం 17 సీట్లు ఖాళీలు ఉన్నట్టు చెప్పారు. అలాగే ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌లో జనరల్ 14 సీట్లు, ఈడబ్ల్యూఎస్ కోటా రెండు, ఎం.కాంలో 34 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. బీకాం, బీఎస్సీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పీజీ సెట్‌తో సంబంధం లేకుండా నేరుగా అడ్మిషన్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. పీజీ సెట్ కోసం దరఖాస్తు పెట్టకపోయినా, పీజీ సెట్‌లో ఉత్తీర్ణత సాధించకపోయినా స్పాట్ అడ్మిషన్‌కు అర్హులుగా పేర్కొన్నారు. ఇందుకోసం ఈ నెల 29వ తేదీ వరకు సైట్ ఓపెన్ అయ్యి ఉంటుందన్నారు. అయితే స్పాట్ అడ్మిషన్ సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిందని, సొంత ఖర్చుతోనే చదువుకోవాల్సి ఆయన స్పష్టం చేశారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్టు

రావికమతం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు కొత్తకోట సీఐ కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. గత నెల 29న గంజాయి తరలిస్తున్న కేరళకు చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వీరికి సరకు అందించిన పెదబయలు మండలానికి చెందిన వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. అతనిపై ప్రత్యేక నిఘా పెట్టామని, గ్రామంలో తిరుగుతున్నట్టు సమాచారం రావడంతో బుధవారం వెళ్లి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అతన్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని సీఐ తెలిపారు.

చోడవరంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు

- ఫిబ్రవరిలోగా గంధవరంలో విత్తన గిడ్డంగి పనులు పూర్తి చేస్తాం
- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రకటించారు. మండలంలోని గంధవరంలో రూ.4.75 కోట్లతో నిర్మిస్తున్న విత్తన గిడ్డంగి పనులను బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. గిడ్డంగికి అవసరమైన విద్యుత్ కనెక్షన్ యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఈపీడీసీఎల్ ఏఈని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరైన ఈ విత్తన గిడ్డంగి పనులకు వైసీపీ ప్రభుత్వం శంకుస్థాపనకే పరిమితం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే పనులు ప్రారంభించామన్నారు. రూ.4.75 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ గిడ్డంగితో పాటు సిబ్బంది క్వార్టర్లు, కార్యాలయ భవనం కూడా నిర్మించనున్నారన్నారు. ఇక్కడే వెయింగ్ బ్రిడ్జి కూడా నిర్మిస్తారన్నారు. ఈ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసి ఫిబ్రవరిలో ప్రారంభించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాకు వ్యవసాయపరంగా జీవనాధారమైన చోడవరం, మాడుగుల ప్రాంతాలు వెనుకబాటుతనానికి గురయ్యాయని, దీనిని అధిగమించేందుకు ప్రభుత్వం చోడవరం ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. బుచ్చెయ్యపేట మండలంలోని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రానికి అనుబంధంగా, చోడవరంలో వ్యవసాయ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలన్నది తన సంకల్పమన్నారు.


గంధవరంలో విత్తన గిడ్డంగి నిర్మాణం పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు

గోవాడలో ప్రైవేటు సహకారంతో డిస్టిలరీ ఏర్పాటు

గోవాడలో ప్రభుత్వ ప్రైవేటు సహకారంతో డిస్టిలరీ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు.ఇది త్వరలో కార్యరూపం దాల్చబోతున్నదన్నారు. చెరకు రైతులను ఆదుకోవడానికి గోవాడ ఫ్యాక్టరీ మనుగడకు ఇది దోహదపడుతుందని చెప్పారు. డిస్టిలరీ ఏర్పాటు చేసే చెరకుతో పాటు మొలాసిస్‌కు అవసరమైన ఇతర పంటల అవసరం కూడా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ నాగసాయి. ఈపీడీసీఎల్ అధికారులు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, టీడీపీ నాయకులు వియ్యపు అప్పారావు, పల్లా అర్జున, భూతనాధు నానికుమార్ పాల్గొన్నారు.

రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ మోహన్

నర్సీపట్నం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ మోహన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు, సీడీ ఫైళ్లను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను సీఐ రేవతమ్మ, ఎస్ఐ రాజారావును అడిగి తెలుసుకున్నారు. అవినీతికి తావు లేకుండా స్నేహపూరిత పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.

చెట్టుపై నుంచి జారిపడి యువకుడికి తీవ్ర గాయాలు

కృష్ణాదేవిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం లింగంపేట గ్రామంలో కొబ్బరి చెట్టుపై నుంచి ఓ యువకుడు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. లింగంపేటకు చెందిన నెల్లూరి విజయ్ మంగళవారం సాయంత్రం కొబ్బరి బొండాలు తాగేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. దీంతో స్పృహ కోల్పోయిన విజయ్‌ను నర్సీపట్నంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. అతని పరిస్థితి కొంచెం విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

రోలుగుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఐటీడీపీ మండల ఇన్‌చార్జి బంటు రాజు సూచించారు. బుధవారం కొవ్వూరు గ్రామంలో క్రియాశీలక సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని పలువురు కార్యకర్తలతో నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రియాశీలక కార్యకర్తలే టీడీపీకి బలమన్నారు. రోలుగుంట మండలం వ్యాప్తంగా 24 పంచాయతీల్లో 12 వేల సభ్యత్వాల నమోదు లక్ష్యం కాగా, ఇప్పటివరకు నాలుగు వేల వరకు మాత్రమే నమోదయ్యాయని చెప్పారు. అన్ని బూత్‌లలో కార్యకర్తలు, నాయకులు ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.

సచివాలయాల్లో సేవలు మెరుగుపర్చండి : ఎంపీడీవో

రోలుగుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో సేవలను మెరుగుపర్చాలని ఎంపీడీవో నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని రత్నంపేట గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఉద్యోగుల సమయపాలనపై ఆరా తీశారు. సిబ్బంది బయోమెట్రిక్ హాజరును పరిశీలించి తగిన సూచలు చేశారు. మ్యాపింగ్, హౌస్ హోల్డ్ జియో ట్యాగ్ సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి ఎంపీడీవో సూచించారు. అనంతరం వివిధ పనులపై సచివాలయానికి వచ్చిన అర్జీదారులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్, కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ ముట్టడికి తరలిరండి

కె.కోటపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆవు పాల ధర తగ్గింపునకు నిరసనగా వచ్చే నెల 2న చేపట్టనున్న విశాఖ డెయిరీ ముట్టడి కార్యక్రమానికి రైతులు తరలిరావాలని ప్రజా సంఘాల కన్వీనర్ యర్ర దేవుడు పిలుపునిచ్చారు. బుధవారం పాడి రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాల ధర ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు పెరిగిన నిష్పత్తిలో పాల ధరను పెంచాలన్న రైతుల విన్నపాలను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. డెయిరీ లాభాల నుంచి ప్రతీ నాలుగు నెలలకు బోనస్ ఇవ్వాలని, డెయిరీలో అవినీతిపై విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థుల ఆధార్ ధ్రువీకరణ వేగవంతం

- హెచ్‌ఎంల సమీక్షలో డీఈవో అప్పారావునాయుడు సూచన
- ప్రైవేటు, యాజమాన్య పాఠశాలల్లో ఈ ప్రక్రియ తక్కువగా ఉందని వెల్లడి




ప్రధానోపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న అప్పారావునాయుడు

అనకాపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆధార్ వేలిడేషన్ (ధ్రువీకరణ), ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఏర్పాట్లు వేగవంతం చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి అప్పారావునాయుడు సూచించారు. స్థానిక జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాలలో జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఎంఈవోలు, ఎంపీడీవోలతో మాట్లాడి ఆధార్ వేలిడేషన్, ఆధార్‌కార్డులో మార్పులు చేసుకునేందుకు ఏర్పాట్లు వేగవంతం చేయాలన్నారు. ఆధార్ వేలిడేషన్ పూర్తయి ఏ రకమైన సాంకేతిక సమస్యలు లేని పిల్లలకు అపార్ జనరేట్ చేయాలన్నారు. ఈ ప్రక్రియ ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో తక్కువగా ఉందని అందువల్ల అపార్ జనరే షన్‌పై ఎంఈవోలు దృష్టి సారించాలని ఆదేశించారు. అదేవిధంగా యు డైస్ ప్లస్-2024-25లో ప్రొఫైల్, స్టూడెంట్స్ మాడ్యూల్స్ పూర్తి చేయాలన్నారు. డిసెంబరు ఏడో తేదీ నుంచి 24వ తేదీ వరకు జరగనున్న మెగా పీటీఎంను దృష్టిలో పెట్టుకుని అన్ని ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలు త్వరితగతిన ఎఫ్ఏ-1 అండ్ 2 మార్కుల సబ్మిషన్ పూర్తి చేయాలని సూచించారు. మెగా పీటీఎంకు చురుగ్గా ఏర్పాట్లు చేసి స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. ఈ మెగా పీటీఎంకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదు పాఠశాలలను పాఠశాల విద్యాశాఖ నేరుగా ఎంపిక చేయడమైందన్నారు. ఎంపికైన పాఠశాలలకు ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరవుతారని వివరించారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లులను సకాలంలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఉదయం తొమ్మిది గంటల కల్లా ఉపాధ్యాయుల బయోమెట్రిక్ సబ్‌మిట్ చేయాలని, పదిన్నర గంటలకల్లా విద్యార్థుల హాజరు పూర్తి చేయాలని సూచించారు. ఎంఈవోలు తరుచూ స్కూళ్లకు వెళ్లి తనిఖీలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఏపీవో, ఎస్‌వో, సమగ్ర శిక్ష అధికారులు పాల్గొన్నారు.

'సూర్యఘర్ యోజన'తో గ్రామాల అభివృద్ధి

- గుల్లేపల్లిలోని అవగాహన సదస్సులో జడ్పీ సీఈవో నారాయణమూర్తి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

సబ్బవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం గృహ వినియోగదారులతో పాటు గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి అన్నారు. ఈ పథకం ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఎంపిక చేసిన మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం అమలులో ప్రథమ స్థానంలో నిలిచిన గ్రామ పంచాయతీకి రూ.కోటి నిధులను కేంద్రం మంజూరు చేస్తుందన్నారు. ఎన్ని గృహాలకు సౌర విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకుంటే ఇంటికి రూ.వెయ్యి చొప్పున పంచాయతీ అకౌంట్‌కు జమవుతుందన్నారు. ఈ నిధులు పంచాయతీ అభివృద్ధికి వినియోగించుకోవచ్చన్నారు. ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి సర్కిల్ ఎస్ఈ జి.ప్రసాద్ మాట్లాడుతూ నెలకు 120 యూనిట్లు వినియోగించే గృహాలకు ఏడాదికి సుమారు రూ.ఎనిమిది వేలు, 240 యూనిట్లు వినియోగించే ఇంటి రూ.20వేలు, 360 యూనిట్లు వినియోగించే ఇంటికి రూ.78 వేలు ఆదా అవుతుందని వివరించారు. గ్రామ ప్రగతి కోసం ఇంటింటికీ సౌర విద్యుత్తు వ్యవస్థను అమర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పి.పద్మజ, సర్పంచ్ బండారు మంగ, పీడీ నిరంజన్ అంబేద్కర్, ఏఈలు వీరేంద్ర, అశోక్, గ్రామ పెద్దలు బోకం రామునాయుడు, బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చురుగ్గా అభివృద్ధి పనులు


అమ్మపేటలో సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

గొలుగొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. చీడిగుమ్మల, ఏటిగైరంపేట, పాకలపాడు, నర్సింగబిల్లి, అమ్మపేట, పాతమల్లంపేట గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్లను కూటమి ప్రభుత్వం సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నది. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా వెదురుపల్లి రోడ్డు నిర్మాణం


రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

నాతవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గొలుగొండపేట-వెదురుపల్లి రోడ్డు నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఆర్‌టీసీ బస్సు కూడా రద్దు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రోడ్డుకు రూ.68 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్డు పూర్తయితే బస్సు సౌకర్యం కలుగుతుందని గ్రామస్థులు చెప్పారు.

నగరంపాలెంలో పూరిల్లు దగ్ధం

దేవరాపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాలాబు శివారు నగరంపాలెంలో బుధవారం తాటాకు ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షల ఆస్తి నష్టం జరిగింది. గ్రామానికి చెందిన తామర్ల కొండబాబు సర్వం కోల్పోయి కట్టు బట్టలతో మిగిలారు. బుధవారం ఉదయం కొండబాబు పొలం పనికి వెళ్లాడు. భార్య దేముడమ్మ ఇంటి పనులు చేస్తుండగా ఒక్కసారిగా మంటలు రావడంతో గ్రామస్థులు అప్రమత్తమై ఆర్పడానికి శత విధాలా ప్రయత్నించారు. అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. దీంతో నిత్యావసర సరకులు, ఇంటిలో సామగ్రి, నగదు కాలి బూడిదయ్యాయి. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి పరామర్శించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిహారం మంజూరు కోసం కృషి చేస్తానన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి వేడుకలు

కె.కోటపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కె.కోటపాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి 416వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశిష్ట పూజలు, శాంతి హోమాలను భక్తిశ్రద్ధలతో చేశారు. మధ్యాహ్నం సుమారు మూడు వేల మందికి అన్న సమారాధన జరిగింది. సాయంత్రం పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంజరుపు బ్రహ్మాజీ, వి.వెంకటరావు, సాతివిల్లి వాసు, ఎం.రాజు, పి.సన్యాసిరావు, ఐ.కృష్ణ, కె.వీరాచారి, రాలి వీరాచారి, ఇంజరుపు సురేశ్, ఆరిపాక తేజ, యువజన సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఐఆర్‌డీఏ విధానాలు ఎల్ఐసీ మనుగడకు గొడ్డలిపెట్టు



సమావేశంలో మాట్లాడుతున్న కేవీ.రమణ

దేవరాపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐఆర్‌డీఏ నూతన విధానాలు ఎల్ఐసీ మనుగడకు గొడ్డలి పెట్టని ఏజెంట్ల ఆర్గనైజింగ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఈసీ సభ్యుడు కేవీ.రమణ అన్నారు. బుధవారం ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేలా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. వయో పరిమితి తగ్గించంతో ఎన్నో ఇబ్బందులు ఉన్నాయన్నారు. కోటి సంతకాలతో ఫిబ్రవరి 11న చలో పార్లమెంటు నిర్వహిస్తామన్నారు. చీఫ్ లైఫ్ ఇన్సురెన్సు సలహాదారు శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు: సీఐ



చిలకలగెడ్డ వద్ద స్టాపర్లను ఏర్పాటులో సీఐ హిమగిరి, ఎస్ఐ శ్రీనివాసరావు

అనంతగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని అరకు సీఐ హిమగిరి హెచ్చరించారు. మండలంలోని చిలకలగెడ్డ చెక్‌పోస్ట్ సమీపంలోని మలుపువద్ద గత రెండు క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంపై బుధవారం ఆరా తీశారు. అనంతరం ఎటువంటి ప్రమాదాలు జరకుండా అనంతగిరి ఎస్ఐ శ్రీనివాసరావు కలిసి స్టాపర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ హిమగిరి మాట్లాడుతూ.. లైసెన్సులు లేకుండా , మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. మీతిమీరిన వేగంగా ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, దీని ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలోని కో ఆప్షన్ సభ్యుడు మదీనా ఉన్నారు.

ఉపాధి హామీ కూలీల పిల్లలకు నైపుణ్య శిక్షణ

పాడేరురూరల్: ఉపాధి హామీ పథకంలో కూలీల పిల్లలు సీడాప్ అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ కోరారు. బుధవారం ఆయన కార్యాలయంలో సీడాప్- డీడీయూ, జీకేవై ఉన్నత కార్యక్రమానికి చెందిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ఉపాధి హామీ కూలీల పిల్లలకు వివిధ నైపుణ్య రంగాలలో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి కల్పిస్తామన్నారు.అభ్యర్థులు 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి పదో తరగతి ఆపై విద్యను అభ్యసించిన వారై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, సీడాప్ జేడీఎం ఎ.కల్యాణిజగదీశ్వరి, ఉన్నతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో టీడీపీ సభ్యత్వ నమోదు

సీలేరు, నవంబరు 27 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమం జోరుగా సాగుతుందని పాడేరు నియోజకవర్గం మెంబర్ షిప్ ఇన్‌చార్జి చిటికెల రాము తెలిపారు. తెలుగుదేశం పార్టీలో సభ్యత్వం తీసుకునే వాళ్లు రెండేళ్ల సభ్యత్వానికి గానురూ. 100 చెల్లించాలని అన్నారు. ఈ సభ్యత్వం పొందిన వారికి ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల వరకు బీమా వర్తిస్తోందని అన్నారు. సీలేరులో ఇప్పటి వరకు 450 సభ్యత్వాలను నమోదు చేశారు. నాయకులు నక్కా తులసీనాథరావుతోపాటు పలువురు కార్యకర్తలు తమ సభ్యత్వాలను రెన్యువల్ చేసినట్టు వివరించారు.

వలస కూలీలకు రగ్గులు, స్వెట్టర్లు పంపిణీ


రగ్గులు అందజేస్తున్న డీటీ సత్యనారాయణ

చింతపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణ పనులకు వచ్చిన కూలీలకు జీకేవీధి ఉప తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ రగ్గులు, స్వెట్టర్లు పంపిణీ చేశారు. బుధవారం చిన్నగెడ్డ గ్రామం టెంట్లు వద్ద నివాసముంటున్న కూలీల కుటుంబ సభ్యులకు వీటిని అందించారు. ఈసందర్భంగా డీటీ మాట్లాడుతూ కొంత కాలంగా తాను సొంత నిధులతో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. ప్రస్తుతం మధ్యప్రదేశ్ నుంచి వలస వచ్చిన కూలీలు చిన్నటెంట్లలో నివాసముంటూ చలికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ స్థితిలో వారి కుటుంబ సభ్యులందరికీ అవసరమైన రగ్గులు, స్వెట్లర్లు కొనుగోలు చేసి పంపిణీ చేసినట్టు వివరించారు.

పంటను ధ్వంసం చేసిన అడవి పందులు


నష్టపోయిన వరి పంటను చూపిస్తున్న రైతు

కొయ్యూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అడవి పందులు రాజేంద్రపాలెంకు గూడెపు లక్ష్మణ్‌కు చెందిన వరి పంటను ధ్వంసం చేశాయి. ఆయనకున్న ఎకరం పొలంలో ఆర్‌జీఎల్ రకం వరి పంటను సాగు చేశాడు. సుమారు రూ. 20 వేల నుంచి రూ 30 వేలు మధ్యలో పెట్టుబడులు పెట్టాడు. వాతావరణ పరిస్థితులు అనుకూలించటంతో సుమారుగా 35 నుంచి 40 బస్తాల మధ్య దిగుబడి వస్తుందని ఆశించాడు. తీరా , సోమ , మంగళవారాలు వరుసగా అడవి పందులు దాడి చేయటంతో పంట సమూలంగా నాశనమైంది. దీంతో చేతికి అందివచ్చిన పంట దెబ్బతిందని, పెట్టుబడి అప్పు ఎలా తీర్చాలని బాధిత రైతు లక్ష్మణ్ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు తన పంటను పరిశీలించి ప్రభుత్వ పరంగా సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.


దుకాణాలు తొలగిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు


ప్రకియను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులో ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగింపు

» ఎమ్మెల్యే మత్స్యలింగం పర్యవేక్షణలో అధికారులు చర్యలు

అరకులోయ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అరకులోయ మెయిన్‌రోడ్‌లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను ఎమ్మెల్యే మత్సలింగం ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు బుధవారం తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ప్రధాన రహదారి ఎస్‌ఎంఐ ఆఫీస్ ఎదుట పలు రకాల దుకాణాలను ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే దగ్గరుండి అధికారులతో కలిసి వీటిని తొలగించారు. పలువురు ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారాలు సాగించడంపై ఎమ్మెల్యే గతంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టకేలకు వీటిని తొలగింపు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం విలేకరులతో మాట్లాడుతూ... పలువురికి పర్మినెంట్‌గా దుకాణాలున్నా, వాటిని కాకుండా ఫుట్‌పాత్‌లను ఆ క్రమిస్తున్నారన్నారు. దీనికి తోడు రోడ్డుపై గొడుగులు వేసి వ్యాపారాలు సాగించడంతో పాదచారులకు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నట్టు చెప్పారు. ఈ స్థితిలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఎంతటివారైనా ఆక్రమణలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ ఆక్రమణలపై ఇప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు వివరించారు. స్థానిక అధికారులు ఉదాసీన వైఖరితో ఆక్రమణలు విచ్చలవిడిగా సాగిపోతున్నాయన్నారు. ఇకనైనా అధికారుల వైఖరి మారాలని, ప్రజలకు, దేశవిదేశాల నుంచి విచ్చేసే పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలన్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు పార్కింగ్, ఆక్రమణలతో పాదచారులు రోడ్డుమధ్యనుంచి నడవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దార్ ఆఫీస్ ప్రహరీని ఆనుకొని ఫుట్‌పాత్‌లపై వెలిసిన దుకాణాలను పరిశీలించారు. ఎదురుగా ఉన్న పశుసంవర్థక శాఖ ఆఫీస్‌కు చెందిన స్థలంలో పంచాయతీ ఆక్రమంగా నిర్మించిన దుకాణసముదాయాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఆ స్థలం ఎవరిది? ఈ దుకాణస ముదాయాలకు ఏ విధంగా నిధులు సమకూర్చారో తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై ప్రజల్లో నెలకొన్న గందరగోళ పరిస్థితి తెరదించేందుకు చర్యలు చేపడతామన్నారు. పట్టణంలో ఎవరు ఆ క్రమణలు పాల్పడినా సహించేదిలేదని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు నాయకులుతో పాటు తహసీల్దార్ ఎం.వి.ఎస్. ప్రసాద్, డీటీ గోవిందరావు, ఆర్ఐ, పంచాయతీ అధికారులు పోలీసులు పాల్గొన్నారు.

అవగాహనతో బాల్య వివాహాలు నిరోధం

» ఐటీడీఏ పీవో అభిషేక్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అందరూ వ్యతిరేకించాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు స్థానిక కస్తూర్బా విద్యాలయంలో బాల్య వివాహాలపై బాలికలకు అవగాహన కల్పనకు ఐసీడీఎస్ అధికారులు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, కనీసం డిగ్రీ వరకు చదువుకుని, 21 ఏళ్లు వచ్చిన అనంతరం వివాహం గురించి ఆలోచన చేయాలన్నారు. బాలికలు ఉన్నతంగా చదువుకుని తల్లిదండ్రులకు ఆసరాగా నిలవాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తే తక్షణమే అధికారులు, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి మాట్లాడుతూ... బాలికలకు విద్య, రక్షణ, ఆరోగ్యం అభివృద్ధికి బాల్య వివాహాలు ఆటంకం కలిగిస్తాయన్నారు. డీఎస్పీ బి.వేణుగోపాల్ మాట్లాడుతూ... శారీరకంగా, మానసికంగా సంపూర్ణమైన ఎదుగుదల వచ్చాక మాత్రమే వివాహాలు చేసుకోవాలన్నారు. ప్రేమ పేరు తో ఎవరైనా ఇబ్బందులు పెడితే 1098 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి చెప్పాలన్నారు.ఈకార్యక్రమంలో డీఈవో బి.బ్రహ్మాజీరావు, డీఎంహెచ్‌వో సి.జమాల్ బాషా, సీడీపీవో ఝాన్సీలక్ష్మి జిల్లా బాలికా సంరక్షణాధికారి డాక్టర్ టి.సద్దు, న్యాయవాది టి.ప్రసాదునాయుడు, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

58 మందికి కు.ని. శస్త్ర చిత్సలు

పెదబయలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం 58 మంది పురుషులకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసినట్టు వైద్యాధికారి నిఖిల్ తెలిపారు. పెదబయలు పీహెచ్‌సీ పరిధిలో 30 కేసులు, గోమంగి పరిధిలో 28 కేసులకు ఈ కు.ని. శస్త్ర చికిత్సలు చేసినట్టు ఆయన వివరించారు. ఈ శస్త్ర చికిత్సలు లోతుగడ్డ వైద్యాధికారి లక్ష్మీకాంత్,దారకొండ డాక్టర్ హిమబిందు,కోరుకొండ డాక్టర్ శివప్రసాద్, గోమంగి డాక్టర్ చైతన్యల పర్యవేక్షణలో జరిగినట్టు తెలిపారు.

వీడీవీకేల అభివృద్ధికి పెట్టుబడి సాయం: పీవో

హుకుంపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వన్‌ధన్ వికాస కేంద్రాల (వీడీవీకే)ల అభివృద్ధికి పెట్టుబడి సాయం అందిస్తామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. మండలంలో భీమవరంలోని వీడీవీకే కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా వీడీవీకే సభ్యులు తయారు చేసిన కొండ చీపుర్లను ఆయన పరిశీలించారు. అనంతరం మహిళలతో పీవో మాట్లాడారు. మహిళలు సమష్టిగా శ్రమించి అటవీ ఉత్పత్తులకు అదనపు విలువను జోడించి ఆర్థికంగా లబ్ధిపొందాలన్నారు. ఇందుకు అవసరమైన యంత్రాలను అందిస్తామని, త్వరలోనే హాట్ బజార్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు.ఈకార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త మృతి


బోయిదేవి(ఫైల్‌ఫొటో)

ముంచంగిపుట్టు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జర్రెల పంచాయతీ దేగలపుట్టులో అంగన్‌వాడీ టీచర్ బురిడి బోయిదేవి (56) బుధవారం మృతి చెందారు. గత 30 ఏళ్లుగా అంగన్‌వాడీ కార్యకర్తగా ఆమె గ్రామంలో సేవలందిస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆమె మృతి చెందారు. సర్పంచి బి.భాగ్యవతి, సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకరావు, తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

పశుగణన సర్వే


సర్వేలో పశువైద్యాధికారి చాలినీ

చింతపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు పశుగణన సర్వేకు సహకరించాలని లంబసింగి పశు వైద్యాధికారి చల్లంగి చాలినీ అన్నారు. బుధవారం లంబసింగి జంక్షన్‌లో ఆమె సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 21 పశుగణనలో భాగంగా పెంపుడు జంతువుల వివరాలను సేకరిస్తున్నామన్నారు. ప్రధానంగా కోళ్లు, మేకలు, గొర్రెలు, ఆవులు, గేదెలు, కుక్కల వివరాలను నమోదు చేస్తున్నట్టు చెప్పారు. ఈసర్వే ఫిబ్రవరి 28వరకు నిర్వహిస్తామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి: సీఐ

చింతపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని స్థానిక సీఐ ఎం. వినోద్ బాబు తెలిపారు. బుధవారం వారపు సంతలో గిరిజనులు, వాహన చోదకులతో సీఐ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయన్నారు.సర్వీసు వాహనాలు పరిమితికి మించి ప్రయాణించరాదన్నారు. అలాగే, గిరిజనులు గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకట రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు ఇబ్బంది లేకుండా చూడాలి

» జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ఆదేశం


పీవోతో ఫోన్‌లో మాట్లాడుతున్న శ్రావణ్ కుమార్

హుకుంపేట నవంబరు 27 (ఆంధ్రజోతి): గిరిజనులకు ఇబ్బందిలేకుండా జీసీసీ పరంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ఆదేశించారు. మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. ముందుగా స్థానిక గ్యాస్ గొడౌన్, పెట్రోల్ బంక్, జీసీసీ డిపోలను పరిశీలించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఇండియన్ గ్యాస్ వినియోగదారులు 4600 మంది పేర్లు పాడేరు రిజిస్ట్రేషన్‌లో ఉన్నాయని, వీటిని హుకుంపేటలో బదిలీ చేయాలని కోరారు.వెంటనే కిడారి పీవో అభిషేక్‌కు ఫోన్‌లో సమస్యలేకుండా చూడాలని కోరారు. పెట్రోల్ బాంకులో పె ట్రోల్, డీజిల్ నాణ్యత పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న జీసీసీ డిపో పూర్తికి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్య క్రమంలో జీసీసీ డీఎం సింహాచలం, గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ సింహాచలం, ఎంపీటీసీ సభ్యులు కోమరమ్మ, మాజీ జీసీసీ చైర్మన్ లక్ష్మణుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు సాగరి సుబ్బారావు, నాయకులు సాగరి సత్యవతి, శిర్గం సూర్యకాంతం కో ఆ పరేట్ డైరెక్టర్ నూకరాజు, సర్పంచి బాకురు వెంకటరమణ, సత్యనారాయణ, శశి భూషణ్, రామలింగం, శంకర్, సుబ్బారావు , తులసీరావు, మహేశ్వరి, జగదీష్ తదితరులున్నారు.

'కూటమి పాలనలో గిరిజన గ్రామాల అభివృద్ధి'

పెదబయలు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బొంగరం పంచాయితీ సర్పంచ్ ఉడ్డు లక్ష్మీపతి అన్నారు. పంచాయితీ పరిధిలో గల రాళ్ళగొంది గ్రామంలో రూ. 60 లక్షల నిధులతో మల్టీ పర్పస్ భవన నిర్మాణానికి సర్పంచి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం నిర్మించనున్న భవనంలో అంగన్‌వాడీ కేంద్రం, ఉప ఆరోగ్య కేంద్రం, రైతులు పండించిన పంటలను భద్రపరచటానికి గోడౌన్‌లుగా ఉపయోగిస్తామన్నారు. అలాగే, బొంగరం గ్రామంలో నిర్మాణ దశలో నిలిచిపోయినా పంచాయితీ భవనానికి పూర్తికి పంచాయతీ నిధులు రూ.3. 50లక్షలు వెచ్చించనున్నట్టు తెలిపారు. దీనికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగంనాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్న సమారాధన


అన్న సమారాధనలో భక్తులు

పాడేరురూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదాన సమీపంలో ఏర్పాటు చేసిన గౌరీ పరమేశ్వరుల మండపం వద్ద బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే, ఉమానీలకంఠేశ్వర స్వామి వారి సమేత రాజరాజేశ్వరి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, రమాదేవి దంపతులతో పాటు పలువురు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కొణతాల సతీష్, ఎల్లపు మోహన్, ఎస్.మధు, బి.సాయి, పి.కొండలరావు, బి.ఆనందరావు, కె.అప్పారావు, సూరిబాబుతో పాటు సంఘం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చందాలతో తాత్కాలిక వంతెన నిర్మాణం


గిరిజనులు నిర్మించిన కల్వర్టు

గూడెంకొత్తవీధి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి పంచాయతీ పనసపల్లి గ్రామానికి చెందిన గిరిజనులు చందాలువేసుకుని తాత్కాలిక కల్వర్టు నిర్మించారు. సెప్టెంబరు 8తేదీన కురిసిన వర్షాలకుగ్రామంలో కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో పొరుగు గ్రామాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. స్థానికులు పలు మార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో స్థానిక గిరిజనులు చందాలు వేసుకుని ఎక్స్‌కవేటర్‌తో వంతెన నిర్మించుకున్నారు. రాకపోకలకు అనువుగా మలిచారు.

రాలపుట్టు కల్వర్టు పనులు పూర్తి చేయండి: సీపీఎం

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ రాలపుట్టు గ్రామ సమీపంలో అసంపూర్తి పనులతో ఉన్న కల్వర్టు పనులను పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కె.త్రినాథ్ కోరారు. ఆ పార్టీ నాయకులు, గ్రామస్తులు బుధవారం నిలిచిపోయిన ఆ కల్వర్టు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామదాసు, గాసీరావు, స్థానికులు పాల్గొన్నారు.

చుట్టుగొంది కల్వర్టుకు మరమ్మతులు

ముంచంగిపుట్టు:బుంగాపుట్టు పంచాయతీ చుట్టుగొంది గ్రామ సమీపంలో కల్వర్టుకు సర్పంచ్ నోబిన చొరవతో తాత్కాలిక మరమ్మతులు బుధవారం జరిగాయి. ఇటీవల వరదలకు కల్వర్టు దెబ్బంది. దీంతో గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్‌తో పాటు వైసీపీ నేత సుకదేవ్‌లు జేసీబీ వాహనాన్ని ఏర్పాటు చేసికల్వర్టు ఇరువైపులా మట్టిని సరిచేశారు.

వరి కోతలు, నూర్పులు వాయిదా వేయాలి

కొయ్యూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాయుగుండ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి చేలు కోతలు, నూర్పులు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఉమాదేవి సూచించారు. బుధవారం మండలంలో బూదరాళ్ళ, మర్రివాడ రైతు సేవ కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బూదరాళ్లలో వర్షాలకు ధాన్యం రంగు మారకుండా జాగ్రత్తలపై సూచనలందించారు. డిసెంబరు మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంట రైతు సేవ కేంద్రం సిబ్బంది సతీష్, ఎండన్న తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి ఎ. శ్రీనివాస్ సూచించారు, బుధవారం గంపరాయి, వలుగుపల్లి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 29 నుంచి డిసెంబరు 3 తేది వరకు తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినట్టు చెప్పారు.

గ్రామాల్లో తాగునీటి, పారిశుధ్య కమిటీలు

» జల జీవన్ జిల్లా కో ఆర్డినేటర్ పుల్లయ్య


మాట్లాడుతున్నా జలజీవన్ జిల్లా కోర్డినేటర్ పుల్లయ్య

హుకుంపేట నవంబరు 27 (ఆంధ్రజోతి): ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుధ్య, తాగునీటి కమిటీలు ఏర్పాటు చేయాలని జలజీవన్ జిల్లా కో ఆర్డినేటర్ పుల్లయ్య తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యలయం వద్ద మండల ఇంజినీరింగ్ ఆధికారులు, సర్పంచ్‌లు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలానికి, పంచాయతీలకు తాగునీటి కమిటీలను 10 నుంచి 15 మంది సభ్యులతో నియమించాలన్నారు. వీటి సర్పంచ్ చైర్మన్‌గా, సభ్యుల భాగస్వామ్యంతో బ్యాంక్‌లో జాయింట్ అకౌంట్ ప్రారంభించాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి వాటర్ ట్యాంక్‌లు శుభ్రం చేసి, క్లోరినేషన్ కార్యక్రమం చేపట్టేలా ఈ కమిటీలు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఈడీ గోపాలకృష్ణ, మండల ఇంజనీరింగ్ ఆదిరి సంజీవ రావు, ఏఈ జగదీష్, సర్పంచులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

» టీడీపీ పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జి గడ్డి ఈశ్వరి


రాజేంద్రపాలెంలో మినీ గోకుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఈశ్వరి

కొయ్యూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అన్నదాత అన్ని విధాల ఆదుకుంటూ తగిన ఆర్థిక సాయం అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు సాగుతున్నదని టీడీపీ పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జి గడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన జంపా దేవకుమారి అనే మహిళా రైతు ఉపాధి హామీ పథకం నిధులు రూ. 1. 32 లక్షలతో నిర్మించనున్న మినీ గోకులం షెడ్డును ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, జనసేన మండల మహిళా నేత సాయి భావన తదితర నేతలతో కలసి శం కుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగా రైతుకు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యాం త్రీకరణ సామగ్రి రాయితీపై అందిస్తోందన్నారు. పశు సంరక్షణకు ఇబ్బంది పడకుండా షెడ్డుల నిర్మాణాలకు గోకులాల పేరుతో నిధులు కేటాయిస్తోందన్నారు.అర్హులకు పథకాలు అందించాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్త, నాయకులపై ఉందని గిడ్డి ఈశ్వరి సూచించారు. మండల పర్యటనలో భాగంగా సోమవారం స్థానిక జడ్పీ అతిథి గృహ ఆవరణలో పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, మహిళ నేతలు బి. సత్యవతి, జి. రాజేశ్వరి, వై. రత్నం, కె వరలక్ష్మి, జనసేన మండల అధ్యక్షుడు గూడెపు లక్ష్మణ్, నేతలు సాగిన బుజ్జిబాబు, వీర మహిళ రోజా పాల్గొన్నారు. అనంతరం ఉపాధి పథకం సిబ్బంది ఈశ్వరిని సన్మానించారు.

కళాశాల విద్యార్థులకు చిత్రకళా పోటీలు


మహిళా కళాశాలలో పోటీలను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ చలపతిరావు

అరకులోయ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌డే పురస్కరించుకుని అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా కళాశాలలో చి త్రకళా పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్‌రిబ్బన్ కో-ఆర్డినేటర్, కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ పుష్పరాజ్ మాట్లాడుతూ ఈ పోటీలను రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించినట్టు చెప్పారు. విజేతలకు డిసెంబరు ఒకటో తేదీ ఎయిడ్స్‌డే రోజున బహుమతులు, సర్టిఫికేట్లు ప్రదానం చేస్తామన్నారు. ఇరు కళాశాలల ప్రిన్సిపాళ్లు డా. భరత్‌కుమార్‌నాయక్, పట్నాసి చలపతిరావు, వృక్షశాస్త్ర అధ్యాపకుడు బి.లచ్చన్నదొర, ఆర్‌ఆర్‌సీ కమిటీ మెంబర్, హిందీ అధ్యాపకురాలు సుందరరాణి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

పాడేరురూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఎం అల్లూరి జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మండల పార్టీ కార్యదర్శి ఎల్.సుందరరావు, పార్టీ నాయకులు పాలికి లక్కు, ఎస్.ధర్మానపడాల్‌తో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులు, కార్మిక సంఘం నాయకులు సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా అవగాహన

సీలేరు, నవంబరు 27 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ, దుప్పులవాడ పంచాయతీల్లో లింగ వివక్షతకు వ్యతిరేకంగా బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ముందుగా ధారకొండ సచివాలయ మహిళా పోలీసు పూజారి పద్మరాజేశ్వరి పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాలు ఉచ్చులో పడకుండా ఉండాలని గిరిజనులకు సూచించారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు: ఎంపీడీవో

చింతపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): లంబసింగికి సమీపంలోనున్న చెరువులవేనంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశాలతో తహసీల్దార్ రవి కుమార్‌తో కలిసి ఎంపీడీవో చెరువులవేనం వ్యూపాయింట్‌ను సందర్శించారు. పర్యాటకుల సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. పరిసరాల్లో పారిశుధ్యం సమస్య తలెత్తకుండగా చెత్తబుట్టలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే వ్యూపాయింట్ వద్ద సందర్శకుల నుంచి ఐటీడీఏ టికెట్ వసూలుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఆదాయంలో పంచాయతీ, పర్యాటక ప్రాంతం అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఒకటో తేదీనుంచి ప్లాస్టిక్ కవర్లు వినియోగం నిషేధం

మండలంలో డిసెంబరు ఒకటో తేదీ నుంచి ప్లాస్టిక్ కవర్లు నిషేధిస్తున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. బుధవారం చింతపల్లి వారపు సంతలో సర్పంచ్ దురియా పుష్పలత, పంచాయతీ ఉద్యోగులు ప్లాస్టిక్ కవర్లు నిషేధంపై ర్యాలీ నిర్వహించి వర్తకులకు అవగాహన కల్పించారు. ప్రజలు కేవలం జ్యూట్ బ్యాగ్‌లను మాత్రమే వినియోగించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే.. రూ.500 నుంచి రూ.1000 జరిమానా విధిస్తామన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

ఈవీఎంలపై కేసు కొట్టివేసిన సుప్రీంకోర్టు: కలెక్టర్

పాడేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించాలని కోరుతూ క్రైస్తవ మత ప్రచారకుడు డాక్టర్ కేఏ పాల్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం ఈనెల 26వ తేదీన కొట్టేసినట్టు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవీఎంలకు వ్యతిరేకంగా దాఖలైన ఈకేసును సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని ఎన్నికల కమిషన్ సూచించింది. ఈ నేపథ్యంలో స్థానిక కలెక్టర్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు.

రోడ్ల దుస్థితికి గత ప్రభుత్వమే కారణం

▸▸ అప్పట్లో నిధులు మంజూరు చేస్తే ఇంత సమస్య ఉండేది కాదు

▸▸ కూటమి ఆధ్వర్యంలో రోడ్లన్నీ తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే కొణతాల



గుంతలు పడిన కాలేజీ బ్రిడ్జి రోడ్డును పరిశీలిస్తున్న కొణతాల రామకృష్ణ

కొత్తూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరులో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గుంతలు పడిన కళాశాల బ్రిడ్జి ప్రధాన రోడ్డును పరిశీలించారు. అదే విధంగా చెరువును పరిశీలించి దాని అభివృద్ధిపై స్థానిక నేతలతో చర్చించారు. త్వరలోనే బ్రిడ్జిపై గుంతలను పూడ్చి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. రూ.80 లక్షలతో బ్రిడ్జి ముందు భాగంలో సీసీ రోడ్డు వేసి, ఆ రోడ్డును విస్తరించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్ల అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించకపోవడం వల్లే రాష్ట్రంలో రహదారులన్నీ గుతులమయంగా మారాయని వాపోయారు. కూటమి ఆధ్వర్యంలో రోడ్లన్నీ నాణ్యతతో వేసి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, భరత్‌బాబు, చదరం నాగేశ్వరరావు, రవి, గణేష్, మేడిశెట్టి సత్తిబాబు, నూకరాజు, కోన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం

▸▸ ఏపీ కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జీ



రైతులకు రాయితీ విత్తనాలు అందిస్తున్న గండి బాబ్జీ

సబ్బవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి, ఏపీ కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జీ సూచించారు. మండలంలోని మొగలిపురం రైతు సేవా కేంద్రంలో బుధవారం ఆయన రాయితీపై ఖరీఫ్ విత్తనాలు, పురుగుల మందులను పంపిణీ చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యం ఇనిస్తుందన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఏవో రమాదేవి, గ్రామ పెద్దలు తమరాన బంగారునాయుడు, అంగటి నానాజీ, గండి నరేష్, శ్రీరాములు, సత్యం, అయినింటి రాజు, బైలపూడి రాంబాబు, పోతునాయుడు, దేవుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో 'మెగాస్టార్ ఫ్యాన్' సందడి



సినీ నటులతో డీవీఎన్ కళాశాల ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీవీఎన్ కళాశాలలో బుధవారం సినీ సందడి నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ అల్లు ప్రొడక్షన్ బ్యానర్‌లో దర్శకుడు కిరణ్ వారియర్, నిర్మాత అల్లు శ్రీరాములు తెరకెక్కించిన 'మెగాస్టార్ ఫ్యాన్' చిత్రం ప్రమోషన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు కిరణ్ వారియర్ మాట్లాడుతూ మెగాస్టార్ అభిమానులు గర్వించేలా ఈ సినిమా తీసినట్టు చెప్పారు. ప్రేక్షకులంతా ఆదరించాల్సిందిగా కోరారు. నిర్మాత అల్లు శ్రీరాములు మాట్లాడుతూ కళాకారులను ఆదరించే గొప్ప సంస్కృతి అనకాపల్లి ప్రాంతవాసులకు ఉందని కితాబునిచ్చారు. హీరోయిన్ సోనిరెడ్డి, జబర్దస్త్ నటుడు గెడ్డం నవీన్, క్రేజీ గణేష్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులతో సరదాగా మాట్లాడి వారిలో జోష్ నింపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీలకు పరవాడ విద్యార్థిని ఎంపిక



తాన్యాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పరవాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో వచ్చే నెల 11న నిర్వహించనున్న జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీలకు సింహాద్రి ఎన్టీపీసీ బాలభారతి పబ్లిక్ స్కూల్‌కు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని తాన్యా గోస్వామి ఎంపికైంది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) ఆధ్వర్యంలో సింహాద్రి ఎన్టీపీసీ సహకారంతో ఇటీవల స్థానిక దీపాంజలినగర్‌లో 'ఎనర్జీ కన్జర్వేషన్ టు ప్రొటెక్టు ద ఎన్విరాన్‌మెంట్' అంశంపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో తాన్యా గోస్వామి ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో ఈమె జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు పాఠశాల ఆర్ట్స్ ఉపాధ్యాయుడు కామేశ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వసంతదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

పదోతరగతి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

కశింకోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బయ్యవరం జిల్లా పరిషత్ హైస్కూలులో పదో తరగతి విద్యార్థులకు మ్యాప్ పాయింటింగ్ పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు, ప్లాంక్‌లను బుధవారం పంపిణీ చేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్య క్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు చేతులమీదుగా వీటిని అందజేశారు. కూటమి నాయకులు ఉగ్గిన రమణమూర్తి, సిదిరెడ్డి శ్రీను, షేక్ బాబర్, అప్పలనాయుడు, వినయ్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆధార్ ధ్రువీకరణ వేగవంతం

▸▸ హెచ్‌ఎంల సమీక్షలో డీఈవో అప్పారావునాయుడు సూచన ▸▸ ప్రైవేటు, యాజమాన్య పాఠశాలల్లో ఈ ప్రక్రియ తక్కువగా ఉందని వెల్లడి





ప్రధానోపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న అప్పారావునాయుడు

అనకాపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆధార్ వేలిడేషన్ (ధ్రువీకరణ), ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఏర్పాట్లు వేగవంతం చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి అప్పారావునాయుడు సూచించారు. స్థానిక జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాలలో జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఎంఈవోలు, ఎంపీడీవోలతో మాట్లాడి ఆధార్ వేలిడేషన్, ఆధార్‌కార్డులో మార్పులు చేసుకునేందుకు ఏర్పాట్లు వేగవంతం చేయాలన్నారు. ఆధార్ వేలిడేషన్ పూర్తయి ఏ రకమైన సాంకేతిక సమస్యలు లేని పిల్లలకు అపార్ జనరేట్ చేయాలన్నారు. ఈ ప్రక్రియ ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో తక్కువగా ఉందని అందువల్ల అపార్ జనరే షన్‌పై ఎంఈవోలు దృష్టి సారించాలని ఆదేశించారు. అదేవిధంగా యు డైస్ ప్లస్-2024-25లో ప్రొఫైల్, స్టూడెంట్స్ మాడ్యూల్స్ పూర్తి చేయాలన్నారు. డిసెంబరు ఏడో తేదీ నుంచి 24వ తేదీ వరకు జరగనున్న మెగా పీటీఎంను దృష్టిలో పెట్టుకుని అన్ని ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలు త్వరితగతిన ఎఫ్‌ఏ-1 అండ్ 2 మార్కుల సబ్మిషన్ పూర్తి చేయాలని సూచించారు. మెగా పీటీఎంకు చురుగ్గా ఏర్పాట్లు చేసి స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. ఈ మెగా పీటీఎంకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదు పాఠశాలలను పాఠశాల విద్యాశాఖ నేరుగా ఎంపిక చేయడమైందన్నారు. ఎంపికైన పాఠశాలలకు ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరవుతారని వివరించారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లులను సకాలంలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఉదయం తొమ్మిది గంటల కల్లా ఉపాధ్యాయుల బయోమెట్రిక్ సబ్‌మిట్ చేయాలని, పదిన్నర గంటలకల్లా విద్యార్థుల హాజరు పూర్తి చేయాలని సూచించారు. ఎంఈవోలు తరుచూ స్కూళ్లకు వెళ్లి తనిఖీలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఏపీవో, ఎస్‌వో, సమగ్ర శిక్ష అధికారులు పాల్గొన్నారు.

'సూర్యఘర్ యోజన'తో గ్రామాల అభివృద్ధి

▸▸ గుల్లేపల్లిలోని అవగాహన సదస్సులో జడ్పీ సీఈవో నారాయణమూర్తి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

సబ్బవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం గృహ వినియోగదారులతో పాటు గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి అన్నారు. ఈ పథకం ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఎంపిక చేసిన మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం అమలులో ప్రథమ స్థానంలో నిలిచిన గ్రామ పంచాయతీకి రూ.కోటి నిధులను కేంద్రం మంజూరు చేస్తుందన్నారు. ఎన్ని గృహాలకు సౌర విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకుంటే ఇంటికి రూ.వెయ్యి చొప్పున పంచాయతీ అకౌంట్‌కు జమవుతుందన్నారు. ఈ నిధులు పంచాయతీ అభివృద్ధికి వినియోగించుకోవచ్చన్నారు. ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి సర్కిల్ ఎస్ఈ జి.ప్రసాద్ మాట్లాడుతూ నెలకు 120 యూనిట్లు వినియోగించే గృహాలకు ఏడాదికి సుమారు రూ.ఎనిమిది వేలు, 240 యూనిట్లు వినియోగించే ఇంటి రూ.20వేలు, 360 యూనిట్లు వినియోగించే ఇంటికి రూ.78 వేలు ఆదా అవుతుందని వివరించారు. గ్రామ ప్రగతి కోసం ఇంటింటికీ సౌర విద్యుత్తు వ్యవస్థను అమర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పి.పద్మజ, సర్పంచ్ బండారు మంగ, పీడీ నిరంజన్ అంబేడ్కర్, ఏఈలు వీరేంద్ర, అశోక్, గ్రామ పెద్దలు బోకం రామునాయుడు, బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండండి

▸▸ విద్యార్థులకు డీఎస్పీ శ్రావణి సూచన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

కొత్తూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఫేక్ కాల్స్ పట్ల విద్యార్థులంతా అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఎం.శ్రావణి సూచించారు. స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో సైబర్ నేరాలపై బుధవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. మాట్రిమోనియా ఫ్రాడ్స్, హనీ ట్రాప్స్, ఏటీఎం ఫ్రాడ్స్ తదితరాల గురించి విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాల్లో ఎక్కువగా యువతి బలవుతున్నారని, తద్వారా వారి జీవితాలు నేరమయం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏ వ్యక్తి అయినా సైబర్ నేరంలో ఉన్నట్లైతే వారికి సంవత్సర కాలం జైలు, రూ.10లక్షలు జరిమానా విధించే అవకాశముందని తెలిపారు. సైకాలజిస్టు సంజన మాట్లాడుతూ సోషల్ మీడియాను అనవసరంగా యువత ఉపయోగిస్తున్నారని దానిని ఏ విధంగా తగ్గించుకోవాలో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్‌కుమార్, కళాశాల సూపరింటెండెంట్ పి.అనురాధ, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎ.సూరిబాబు, బి.ఎం.వి.పి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువ మీదుగా బైపాస్ నిర్మించండి

▸▸ పరిశ్రమల ఫ్లైయాష్, బొగ్గు తరలింపుతో తీవ్ర ఇబ్బందులు

▸▸ ఎమ్మెల్యే పంచకర్లకు వినతిని అందించిన ప్రజా సంఘాలు



ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు వినతి పత్రం అందిస్తున్న ప్రతినిధులు

లంకెలపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జాతీయ రహదారిలోని హోమీబాబా కేన్సర్ ఆస్పత్రి నుంచి ఏలేరు కాలువ మీదగా బైపాస్ రోడ్డు నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు స్థానిక ప్రజా సంఘాల నేతలు బుధవారం పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీపీసీ ఫ్లైయాష్, హిందూజా పరిశ్రమ బొగ్గు తరలింపు కారణంగా లంకెలపాలెం పరిసర ప్రాంత కాలనీలు మొత్తం కాలుష్యంతో నిండిపోయాయని, ఈ కారణంగా ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఫార్మాసిటీ పరిశ్రమల కారణంగా విపరీతమైన ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని ఏలేరు కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి బైపాస్ రోడ్డు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు బొండా అప్పారావు, మడక రమేశ్‌నాయుడు, అమర పిన్ని జోగినాయుడు, గొల్లవిల్లి నాగరాజు తదితరులు ఉన్నారు.

'ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక నిధులు'



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఎం లచ్చన్న

కశింకోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సుందరయ్యపేటలో గల నూకాంబిక ప్రకృతి వ్యవసాయ వనరుల శిక్షణ కేంద్రాన్ని డీపీఎం లచ్చన్న బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేకంగా నిధులు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. సేంద్రియ ఎరువులు వాడాలంటూ ఇప్పటికే 70 మంది ఐసీఆర్‌పీలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. కషాయాల తయారీ, వాటి వినియోగం, పనితీరు, మార్కెటింగ్ చేయడం బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ అధికారులు ప్రకాశ్, శ్యామ్‌సుందర్, గోవింద తదితరులు పాల్గొన్నారు.


రావాడలో టీడీపీ సభ్యత్వ నమోదు

పరవాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావాడలో బుధవారం టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న తొలుత ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభ్యత్వం తీసుకోవడం వల్లే కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యకర్తలంతా సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలన్నారు. అలాగే, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. నాయకులు మరిసా అప్పలరాజు, సాలాపు వెంకటరమణ, కోన కృష్ణ, మోటూరు అప్పారావు, మరిసా బుల్లి అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న ప్రముఖులు



ఆదిదంపతులను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల



అమ్మవారి ఆలయంలో రఘునాథ్ దంపతులు పూజలు

అనకాపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గవరపాలెం పీలా వారి గౌరీపరమేశ్వరుల ఉత్సవంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనను సత్కరించారు. అలాగే, మహిళా కళాశాల అధినేత కొణతాల రఘునాథ్ దంపతులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనను రఘునాథ్ దంపతులు ప్రారంభించారు. వినాయక గౌరీ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమితి శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాగూర్ ఫార్మా కార్మికులకు పరామర్శలు

ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న గండి బాబ్జీ



ఉద్యోగిని పరామర్శిస్తున్న గండి బాబ్జీ

పరవాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీలోని ఠాగూర్ ఫార్మా పరిశ్రమలో విష వాయువులు లీకైన ఘటనలో అస్వస్థతకు గురై షీలానగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉద్యోగులను పెందుర్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ బుధవారం రాత్రి పరామర్శించారు. వీరికి మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యులకు సూచించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.

పరవాడ : ఫార్మాసిటీలోని ఠాగూర్ ఫార్మా పరిశ్రమలో మంగళవారం జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రమాదాన్ని యాజమాన్యం గోప్యంగా ఉంచడంపై మండిపడ్డారు. బుధవారం ప్రమాదం జరిగిన ఠాగూర్ పరిశ్రమను సందర్శించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఫార్మా యాజమాన్యాలకు కార్మికుల ప్రాణాలంటే లెక్క లేకుండా పోయిందన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే హెల్పర్ అమిత్‌భాగ్ ప్రాణాలు కోల్పోగా మరో పది మంది ఆసుపత్రి పాలయ్యారన్నారు. ఈ సంఘటన పై సమగ్ర విచారణ జరిపించడంతో పాటు మృతుని కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

అనకాపల్లి టౌన్ : ఠాగూర్ ఫార్మా కంపెనీలో విషవాయువులు లీకైన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావులు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. సంఘటనలో మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ. కోటి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

వెదురుపర్తి పాఠశాలలో క్విజ్ పోటీలు

కశింకోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వెదురుపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సంగ్రహనాత్మక మూల్యాంకనం-1 సిలబస్‌పై బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ గణిత మాసోత్సవాల్లో భాగంగా మూడు నుంచి పదో తరగతి వరకు ఐదు గ్రూపులుగా విద్యార్థులను విభజించి ఈ పోటీలు జరిపారు. తొలుత హెచ్‌ఎం జి.వి.కె.ఆచారి ఈ పోటీలను ప్రారంభించారు. ఉపాధ్యాయులు ఎ.వి.ఎస్.మూర్తి, సవితలక్ష్మి, సత్యవేణి, చిన్నారావు, సోమరాజు, విజయ్, విజయలక్ష్మి, నూకరాజు, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

'పాడి రైతుల సంక్షేమమే హెరిటేజ్ లక్ష్యం'

పరవాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హెరిటేజ్ డెయిరీ సేవలను పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ రీజనల్ మేనేజర్ తులసీనాయుడు కోరారు. మండలంలోని వాడచీపురుపల్లిలో బుధవారం పాడి రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. రైతులకు పశుదాణాలు రాయితీపై అందజేస్తామన్నారు. పశువులకు కృత్రిమ గర్భాదారణ రూ.50కే చేస్తామని వెల్లడించారు. రైతులకు ఆరు నెలలకు ఒకసారి బోనస్ అందిస్తున్నామని, ప్రమాదంలో చనిపోయిన రైతు కుటుంబానికి రూ.రెండు లక్షలు, సహజ మరణానికి రూ. 50 వేలు అందిస్తున్నట్టు చెప్పారు. డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు, హెచ్‌టీఆర్ సన్యాసమ్మ, వెంకటరావు, అప్పారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో ప్రతినిధులు

పరవాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఫార్మా రీసస్టైన బిలిటీ లిమిటెడ్, రాంకీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. అజినిమోటు బయో ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ కేకే రాజు బుధవారం దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ వారికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ వీపీ లాల్‌కృష్ణ, రాంకీ గ్రూప్ సీఈవో ఎం. వాసుదేవరెడ్డి, స్థానిక సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, పాఠశాల హెచ్‌ఎం బి. అప్పలనాయుడు, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, స్థానిక నాయకులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

కొత్తూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేబాక పరిధి గురజాడనగర్‌కు చెందిన బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు అనకాపల్లి రూరల్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఈ నెల 20న బట్టలు కొనుగోలుకని ఇంటి నుంచి వెళ్లి నేటి వరకు తిరిగి రాలేదని ఆమె తల్లిదండ్రులు ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వలంటీర్ల ఆందోళన



అనకాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

అనకాపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ వలంటీర్లు బుధవారం ఆందోళన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయాల వలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా నెహ్రూచౌక్ చేరుకుని మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం సమీపంలోని బస్టాప్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను విధుల్లోకి తీసుకుని రూ.10 వేలు వేతనం ఇవ్వాలని, గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జాబ్ చార్టును ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.దీప్తి, సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వలంటీర్లను విధుల్లోకి చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న రెండు లక్షల 65వేల మంది వలంటీర్లను వీధిన పడేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ల జిల్లా యూనియన్ నాయకులు కిరణ్, పీర్‌సాహెబ్, విజయ్‌కుమార్, సంధ్య, అయోధ్య గీత తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో వలంటార్లు పాల్గొన్నారు.

సీఐటీయూను వీడి ఏఐటీయూసీలో చేరిన క్లాప్ వర్కర్లు



ఏఐటీయూసీలో చేరిన క్లాప్ వర్కర్లు

అనకాపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో పనిచేస్తున్న 30 మంది క్లాప్ వర్కర్లు సీఐటీయూ నుంచి ఏఐటీయూసీలో బుధవారం చేరారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కోన లక్ష్మణ ఆధ్వర్యంలో వీరు చేరడంతో జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పడాల రమణ, లక్ష్మణ తదితరులు వీరికి కండువాలు కప్పి యూనియన్‌లోకి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పడాల రమణ మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లు, కార్మికుల ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ డబ్బులు కట్టకుండా సొమ్మును దోచుకుంటున్న కాంట్రాక్టర్లపై జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నిమ్మకాయల నరసింహమూర్తి, బంగారు రవికుమార్, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు కోన దుర్గ, పలివెల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతిగా మొక్క

ఇటీవల పెరుగుతున్న సంస్కృతి

- వేడుకల్లో భాగమవుతున్న వైనం
- పర్యావరణానికి మేలు చేసే గ్రీన్ ప్లాంట్స్
- అందుబాటులో బడ్జెట్, ఎకో ఫ్రెండ్లీ మొక్కలు

(ఎండాడ-ఆంధ్రజ్యోతి)



సందర్భానుసారం వివిధ రకాల బహుమతులు ఇచ్చి, పుచ్చుకోవడం ఆనవాయితీ. బొమ్మలు, చిత్రపటాలు, గడియారాలు, గృహోపకరణాలు బహుమతులుగా ఇవ్వడం రివాజు. ప్రస్తుత తరం వినూత్నంగా ఆలోచించి, వీటి స్థానంలో పర్యావరణానికి దోహదపడే మొక్కలను బహుమతులుగా అందించడం ప్రారంభించింది. ఈ సంస్కృతి ఇటీవల విస్తరిస్తోంది. ఈ బహుమతి మధురానుభూతిని కలిగించడంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి సహకరిస్తుందని చెబుతున్నారు.

సంతోషం పంచుకునే సందర్భాల్లో బహుమతులను ఇచ్చి పుచ్చుకోవడం ఆనవాయితీ. సాధారణంగా చాక్లెట్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, గృహోపకరణాలు బహుమతులుగా ఇవ్వడం రివాజు. కాలం మారింది. బహుమతి ఇస్తే తీసుకున్న వారి మోములో చిరునవ్వు కనిపించాలి. వారికి ఉపయోగపడాలి. ఆరోగ్యానికి సహకరించాలి. ఈ కోవలోకే గ్రీన్ విషెస్, గ్రీన్ ఫెస్టివల్ బహుమతులు అందుబాటులోకి వచ్చాయి.



కొత్తగా ఆలోచించాలి

శుభ కార్యక్రమాలు, పుట్టినరోజు వేడుకలు, గృహ ప్రవేశాలు లాంటి సందర్భాల్లో బంధువులు, స్నేహితులు, సహోద్యోగులకు మొక్కలను బహుమతులుగా అందించేందుకు చాలామంది ముందుకువస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు ఇవి ఇతోధికంగా తోడ్పాటును అందించడంతో పాటు, బహుమతిని స్వీకరించిన వారిలోనూ కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. సాధారణ మొక్కల నుంచి అరుదైన ప్లాంట్‌లను బహుమతిగా అందిస్తున్నారు. రేపటి పచ్చదనానికి పునాది వేసే క్రమంలో బహుమతిగా మొక్కలను అందించే సంస్కృతి మరింతగా పెరగాల్సి ఉంది.



పెపరోమియా

ఈ మొక్కలను ఇవ్వండి



స్నేక్ ప్లాంట్

బహుమతిగా అందించడానికి స్నేక్ ప్లాంట్ మంచి ఎంపిక. ఇది చాలా అందంగా ఉండడంతో పాటు ఎయిర్ ప్యూరిఫైయర్‌గా పనిచేస్తుంది. పర్యావరణానికి అనుకూలం. బెడ్‌రూమ్‌లో పెంచుకుంటే ఆరోగ్యానికి సహకరిస్తుంది. రాత్రి పూట ఆక్సిజన్‌ను విడుదల చేయడం దీని ప్రత్యేకత. సమయానికి నీరు పోయాల్సిన అవసరం ఉండదు. మట్టిలో తేమ శాతం పూర్తిగా ఆరితేనే నీరు అందించాలి.

ఇలాంటి జాతికి చెందినదే పెపరోమియా, ఇది స్నేహితులకు, సహోద్యోగులకు ఇచ్చేందుకు బాగుంటుంది. ఇల్లు, కార్యాలయంలో పెట్టుకోవడానికి అనుకూలం. ఆకర్షణీయంగా ఉంటుంది. నిర్వహణ సులభం. అందంగా ఉండడంతో పాటు తక్కువ స్థలాన్ని ఆక్రమిస్తుంది.

గార్డెనింగ్ ఇష్టపడే స్నేహితులుంటే వారికి అంథూరియం అనే మొక్కను బహుమతిగా ఇవ్వవచ్చు. దీని నుంచి వచ్చే ఎరుపు రంగు పూల అందం వాతావరణాన్ని ఆహ్లాదంగా మార్చేస్తుంది.

ఆరోగ్య పరిరక్షణకు

ప్రస్తుతం ప్రపంచాన్ని కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దీనిని అధిగమించేందుకు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని ప్రభుత్వాలు పిలుపునిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇలా మొక్కలను బహుమతులుగా అందివ్వడం పర్యావరణానికి మేలు చేస్తుంది. దేశంలో ప్రతి సంవత్సరం 12.5 శాతం మంది ప్రజలు వాయు కాలుష్యంతో మరణిస్తున్నారు. ఐదు సంవత్సరాల తక్కువ వయసున్న పిల్లలు 8.5 శాతం మంది కాలుష్యానికి బలైపోతున్నారని ఎన్విరాన్‌మెంట్ సర్వేలు చెబుతున్నాయి. కాలుష్యం నుంచి తప్పించుకునేందుకు మొక్కల పెంపకం మినహా ప్రత్యామ్నాయం లేదని కూడా సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బహుమతిగా అందించేందుకు వివిధ రకాల ఔషధ గుణాలున్న మొక్కలు మార్కెట్లో లభిస్తున్నాయి.

మరికొన్ని మొక్కలు

ఎయిర్ ప్లాంట్స్ డిజర్ట్ రోజ్, పోనీటెయిల్ పామ్ బిగోనియా, చైనీస్ ఎవర్‌గ్రీన్, మనీ ప్లాంట్, అలోవెరా, జెడ్ ప్లాంట్ వంటి మొక్కలు పెంచుకోవడానికి పెద్దగా శ్రమ పడాల్సిన అవసరం ఉండదు. ఏపుగా పెరిగి ఇంటి అందాన్ని పెంచుతాయి. వీటితో పాటు పెద్దగాపెరిగి నీడనిచ్చే చెట్లు ఉంటాయి. వీటినీ బహుమతులుగా ఇవ్వవచ్చు. అటువంటి వాటిలో వేప, నేరేడు, మహువా (ఇప్ప), మామిడి, బూరుగు, అశోక విముఖ్యమైనవి. వీటిని ఓపెన్ ప్లేస్, రహదారుల పక్కన పెంచడానికి అవకాశం ఉంటుంది. ఇటువంటి మొక్కలను కుండీలలో పెట్టి అందంగా ప్యాక్ చేసి వాటికి పక్కనే చాక్లెట్లు వంటివి అలంకరణగా ఉంచి బహుమతులుగా అందిస్తే ఇచ్చిన వారికీ, తీసుకున్న వారికీ ఆనందమే.



అంథూరియం

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు వేములపూడి విద్యార్థి



పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

నర్సీపట్నం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు వేములపూడి ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న తులసీరాజ్ ఎంపికైనట్టు హెచ్ఎం జి.రమణ తెలిపారు. ఈ నెల 24, 25,26 తేదీల్లో తిరుపతిలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర జిల్లా స్థాయి పోటీల్లో తులసీరాజ్ ప్రతిభ కనబరిచాడన్నారు. మహారాష్ట్రలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటాడన్నారు.

ముగిసిన ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ

భీమునిపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. పురుషుల విభాగంలో ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ జట్టు, మహిళా విభాగంలో విశాఖ ఉమెన్స్ కళాశాల జట్టు విజేతలుగా నిలిచాయి. మహిళల విభాగంలో ద్వితీయ స్థానంలో ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ జట్టు, తృతీయ స్థానంలో అనకాపల్లి ఏఎంఏఎల్ డిగ్రీ కళాశాల జట్టు నిలిచాయి. అలాగే పురుషుల విభాగంలో ద్వితీయ స్థానంలో ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తృతీయ స్థానాన్ని అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెలుచుకున్నాయి. విజేతలకు ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, కళాశాల పూర్వ విద్యార్థి, వాలీబాల్ క్రీడాకారుడు బోర శ్రీనివాసరెడ్డి బహుమతులు అందజేశారు.

లింగ వివక్ష చూపకుండా పిల్లలను పెంచాలి

- బాల్య వివాహాలను ప్రోత్సహించ వద్దు
- స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం
- పని ప్రదేశాల్లో వేధిస్తే కఠిన చర్యలు
- కిశోరి వికాసంపై శిక్షణ శిబిరంలో కలెక్టర్ విజయకృష్ణన్



కిశోరి వికాసం కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

అనకాపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పిల్లలను లింగ వివక్ష చూపకుండా పెంచాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ కిశోరి వికాసం కార్యక్రమంపై నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. కిశోరి వికాసం కార్యక్రమ ఉద్దేశాన్ని, బాలబాలికల హక్కులను తెలుసుకుని గ్రామస్థాయికి తీసుకు వెళ్లాలని సూచించారు. బాల బాలికలకు వివక్ష చూపించకుండా చదువు చెప్పించాలన్నారు. బాల్య వివాహాలు చేయవద్దన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిని కఠినంగా శిక్షించాలని సూచించారు. బాలికలకు చదువుతో పాటు వారు ఆర్థికంగా స్థిరపడిన తరువాత మాత్రమే వివాహం జరిపించాలన్నారు. బాలికలకు పౌష్టికాహారం అందించాలని, వారికి వ్యాయామం, ఆటలు, శారీరక ఫిట్నెస్‌పై, యుక్త వయస్సులో ఎదురయ్యే శారీరక మార్పుల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలు వారి సందేహాలను, సమస్యలను తల్లిదండ్రులతో చెప్పుకొనే స్వేచ్ఛను ఇవ్వాలన్నారు. తప్పు చేసినప్పుడు శిక్షించకుండా వారితో మాట్లాడి, వారిలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నించాలని సూచించాలన్నారు. పని ప్రదేశాల్లో స్త్రీలపై వేధింపులు చేసినా, బాడీ షేమింగు చేసినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదనపు ఎస్పీ (క్రైమ్) ఎల్.మోహనరావు మాట్లాడుతూ ప్రస్తుతం బాలబాలికలు చదువుల లక్ష్యంతో మానసిక ఒత్తిడిలో ఉంటున్నారని, కుటుంబ సభ్యులు వారికి సమయం కేటాయించాలని వివరించారు. పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులు విద్యార్థినుల సమస్యలను తెలుసుకుని వారికి ధైర్యాన్ని అందించాలని, చదువులు కొనసాగే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం కిశోరి వికాసం కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను అంతా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో ఎస్.మంజులరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ పథక సంచాలకులు కె.అనంతలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, డాక్టర్ క్రాంతి, న్యాయవాది కుసుమ, మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పి.రాములమ్మ, యోగా రిసోర్స్ పర్సన్ డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లైన నెల రోజులకే అనంత లోకాలకు...

- స్టీల్‌ప్లాంటు రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకులు మృతి
- మృతులు మేనమామ, మేనల్లుడు... స్వస్థలం పాలకొండ



మృతిచెందిన పవన్‌కుమార్ (కూర్చున్న యువకుడు), రూపేష్‌కుమార్ (వెనక నిల్చున్న యువకుడు)

ఉక్కుటౌన్‌షిప్ (విశాఖపట్నం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెళ్లైయిన నెల రోజులకే ఆ యువకుడికి నిండు నూరేళ్లు నిండిపోయాయి. అతనితోపాటు మరొకరు బుధవారం రాత్రి స్టీల్ ప్లాంటు ప్రధాన మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వివరా లిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా లోని పాలకొండ ఇంద్రానగర్ ప్రాంతానికి చెందిన డబ్బీరు పవన్ కుమార్ (30) పరవాడ ఫార్మా సిటీలో పనిచేస్తూ కూర్మన్నపాలెం సమీపాన గల శాతవాహన నగర్‌లో నివాసముంటున్నాడు. అతని మేనల్లుడు కొం డవలన రూపేష్‌కుమార్ (21) హైదరాబాద్‌లో సీఏ ఫైనలియర్ చదువుతున్నాడు. ఇద్దరూ కలిసి బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై కూర్మన్నపాలెం జంక్షన్ నుంచి స్టీల్‌ప్లాంటు ప్రధాన మార్గంలో కణితి వైపు వెళుతుండగా వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురూ సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఇదిలావుండగా హైదరాబాద్‌లో చదువుకుంటున్న రూపేష్‌కుమార్ ఇక్కడకు ఎప్పుడు వచ్చాడో, ఎందుకు వచ్చాడో తెలియదని అతని తల్లి, పవన్‌కుమార్ అక్క సంఘటనా స్థలం వద్ద భోరున విలపించింది. సమాచారం అందుకున్న స్టీల్ ప్లాంటు శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రమాదం జరిగిన వెంటనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు.

పెళ్లైన నెల రోజులకే...

ఈ ప్రమాదంలో మృతిచెందిన పవన్‌కుమార్‌కు గత నెల 26న వివాహమైందని అతని అక్క తెలిపింది. కూర్మన్నపాలెం శాతవాహన నగర్ ప్రాంతంలో అద్దెకు ఉంటున్నాడని, మరికొద్దిరోజుల్లో భార్యను ఇక్కడకు తీసుకువచ్చేందుకు చూస్తున్న సమయంలో ఘోరం జరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది.

కొనసాగిన ఏసీబీ సోదాలు

- జడ్పీ సింహాచలానికి సంబంధించిన మరికొన్ని ఆస్తులు గుర్తింపు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-2 కమిషనర్ పొందూరు సింహాచలం నివాసంతోపాటు అతని బంధువుల ఇళ్లలో ఏసీబీ సోదాలు బుధవారం కూడా కొనసాగాయి. తొలిరోజు రూ.రెండు కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను గుర్తించిన ఏసీబీ అధికారులు...బుధవారం మరికొన్ని డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కొత్తపేటలోని వియ్యంకుని ఇంట్లో సోదాలు జరిపిన ఏసీబీ అధికారులు...ఆ ప్రాంతంలో సింహాచలానికి అర ఎకరా వ్యవసాయ భూమి ఉన్నట్టు గుర్తించారు. అందుకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. దానిని 2003లో సింహాచలం కొనుగోలు చేశారు. అలాగే సింహాచలం తన మేనల్లుడు పేరిట శ్రీకాకుళం పట్టణంలో ఒక ఫ్లాట్‌ను 2013లో కొనుగోలు చేశారు. ఆ ఫ్లాట్‌ను తానే కొనుగోలు చేసినట్టు సింహాచలం అంగీకరించారు. ఆ ఫ్లాట్ నెలవారీ అద్దె సింహాచలం అకౌంట్‌కే జమ అవుతున్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు.

రెండు రోజుల సోదాల్లో రూ.2.5 కోట్లు విలువ చేసే ఆస్తులను గుర్తించామని, వాటి మార్కెట్ విలువ రూ.30 కోట్లు వరకూ ఉంటుందని అంచనా వేస్తున్నట్టు అధికారులు తెలిపారు. సింహాచలాన్ని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచగా వచ్చే నెల పదో తేదీ వరకూ రిమాండ్ విధించినట్టు డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు తెలిపారు.

మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా శ్రీనివాసులు



ఎస్పీ తుహిన్‌సిన్హాను కలిసిన డీఎస్పీ శ్రీనివాసులు

అనకాపల్లి రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా ఇ.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా చీఫ్ ఆఫీస్ వీఆర్ నుంచి ఇక్కడికి బదిలీపై విచ్చేశారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీ తుహిన్‌సిన్హాను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఇదిలావుంటే, ఇంతవరకు ఈ స్థానంలో ఉన్న ఎం. ఉపేంద్రబాబు ఆరు నెలల క్రితం పదవీ విరమణ పొందిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఈ పోస్టులో శ్రీనివాసులును ఉన్నతాధికారులు నియమించారు.

‘గిరిజనుల సామాజిక, ఆర్థిక వృద్ధే లక్ష్యం’



పీఓ అభిషేక్‌కు జ్ఞాపిక అందిస్తున్న టీసీఆర్ అండ్ టీఎం ఈడీ

సాగర్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రాంతాల సామాజిక, ఆర్థిక అభివృద్ధే టీసీఆర్ అండ్ టీఎం లక్ష్యమని అల్లూరి జిల్లా ఐటీడీఏ పీఓ అభిషేక్ అన్నారు. బుధవారం ఆయన రుషికొండ గిరిజన భవనం వద్ద జన జాతి గౌరవ దివస్ ముగింపు వేడుకల్లో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గిరిజనులు అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం గిరిజన స్వాభిమాన ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి స్థానం సీతంపేట, రెండవస్థానం అల్లూరి ఐటీడీఏలు కైవసం చేసుకున్నాయి. ఈకార్యక్రమంలో టీసీఆర్ అండ్ టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణిమంద, తదితరులు పాల్గొన్నారు.

---

30 మద్యం బాటిళ్లు స్వాధీనం



అనకాపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గుండాలవీధి జంక్షన్‌లో బుధవారం సాయంత్రం ఒక వ్యక్తి నుంచి ముప్పై క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. దాడి శివ శంకర్ అనే వ్యక్తి పాన్‌షాపు పక్కన మద్యం అమ్మకాలు సాగిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అదే నిర్లక్ష్యం!

... 5వ పేజీ తరువాయి

ఫ్యాక్టరీస్, కార్మిక, అగ్నిమాపక, బాయిలర్ చెకింగ్ వ్యవస్థలు తనిఖీలపై అశ్రద్ధ చేస్తున్నాయి. అచ్యుతాపురం, పరవాడ, రాంబిల్లి మండలాల్లో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి రాయితీపై భూములు, నీరు, కరెంట్ వంటి మౌలిక సదుపాయాలు పొందుతున్న యాజమాన్యాలు... వీటిల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రత, రక్షణకు సరైన చర్యలు చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

వెల్లడి కాని విచారణ నివేదికలు

చిన్న చిన్న మానవ తప్పిదాల వల్ల ఫార్మా కంపెనీల్లో పెద్ద పెద్ద ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదం జరిగిన ప్రతి సందర్భంలోనూ విచారణ కమిటీలను నియమిస్తున్నప్పటికీ ప్రభుత్వానికి అందిస్తున్న నివేదికలను మాత్రమే బయటకు వెల్లడించడం లేదు. ఆగస్టులో అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన భారీ ప్రమాదంపై వసుధామిశ్రా ఛైర్మన్‌గా ఉన్నతస్థాయి కమిటీని విచారణకు నియమించింది. ఆ కమిటీ విచారణ నివేదిక ఇంతవరకు బహిర్గతం కాలేదు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఫార్మా కంపెనీల్లో జరిగిన ప్రమాదాలపై నియమించిన విచారణ కమిటీల నివేదికలు సైతం బయటకు రాలేదు. విచారణ కమిటీల నివేదికలను బహిర్గతం చేయకపోవడం, కంపెనీల్లో ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదలు జరుగుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఠాగూర్ ఫార్మా కార్మికులకు చికిత్స

... 5వ పేజీ తరువాయి

చికిత్స పొందుతున్న ఇద్దరు బాధితులను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా పరామర్శించారు. తొలుత ఇక్కడకు ముగ్గురు కార్మికులను తీసుకురాగా వీరిలో అమిత్‌భాగ్(23) బుధవారం మధ్యాహ్నం మృతిచెందినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా విజయకృష్ణన్ విలేకరులతో మాట్లాడుతూ, మృతిచెందిన అమిత్‌భాగ్ కుటుంబానికి నష్టపరిహారం విషయమై ఫార్మా కంపెనీ యాజమాన్యంతో చర్చిస్తున్నామన్నారు.

‘రైవాడ’కు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

బండారు సత్యనారాయణమూర్తి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టులు ఉనికి కోల్పోకుండా వాటిని కాపాడుకోవడానికి కూటమి ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టిందన్నారు. డ్యామ్ రిహాబిలిటేషన్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు (డీఆర్ఐపీ.. డ్రిప్) కింద రాష్ట్రంలో శ్రీశైలం, ధవళేశ్వరం, రైవాడ ప్రాజెక్టును రూ.1,000 కోట్లతో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని చెప్పారు. ఇందులో రూ.336 కోట్లతో రైవాడ జలాశయం ఆధునికీకరణ, విస్తరణ, అభి వృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపామని, సాం కేతిక ఆమోదం లభించాల్సి వుందని బండారు చెప్పారు. ఇందులో భాగంగానే నిపుణుల బృందం రైవాడ జలాశయాన్ని పరిశీలించినట్టు వెల్లడించారు. కాగా పోలవరం ప్రాజెక్టు పూర్తయిన తరువాత రైవాడ నుంచి జీవీఎంసీకి నీటి సరఫరా అవసరం వుండదని, ఆ నీటిని కూడా రైతులకే సరఫరా చేస్తామని, తద్వారా ఆరు వేల ఎకరాల అదనపు ఆయకట్టు సాగులోకి వస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



అతిథి గృహంలో సీడబ్ల్యూసీ నిపుణులతో భేటీ అయిన ఎమ్మెల్యే బండారు

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589